

# నేటి నిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com

E-mail : netinijam93@gmail.com




హైదరాబాద్ | శుక్రవారం 18-9-2020 | RNI No.52865/93·Postal No\.H/SD/258/2018-201 | ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 | సంపుటి :27 | సంచిక:39 | పేజీలు: 4 | వెల: రూ.1/-


# అల్పపీడన ప్రభావంతో భారీగా వర్షాలు

### పొంగుతున్న వాగులతో తెలంగాణకు జలకళ
### ఏడుపాయల వద్ద జలజాతర
### ఉధృతంగా ప్రవహిస్తున్న మూసీ, కాగ్నా నదులు
### జంటనగరాల్లో మేఘావృతం..వర్షం

హైదరాబాద్,సెప్టెంబర్17(ఆర్ఎన్ఎ): బంగాళాఖాతంలో కొనసాగుతున్న అల్పపీడన ప్రభావంతో తెలంగాణ వ్యాప్తంగా విస్తారంగా వానలు దంచి కొడుతున్నాయి. విస్తారంగా కురున్నవర్షాలకు తెలంగాణ జలకళను సంతరించుకుంది. పలు చోట్ల పంటలు నీటమునిగాయి. మెదక్ జిల్లాలో జు తెల్లవారుజాము నుంచి వన దుర్గా ప్రాజెక్ట్ పొంగిపొర్లుతున్నది. ఏడుపాయల దుర్గా భవాని అమ్మవారి ఆలయం ముందు నుంచి నీరు పరవళ్లు తొక్కుతూ నిజాంసాగర్ వైపు పరుగులు పెడుతున్నది. సింగూరులోకి కూడా వరదనీరు చేరుతోంది.

వికారాబాద్ జిల్లాలో గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు మూసీ, కాగ్నా నదులు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. కోటిపల్లి ప్రాజెక్టు అలుగు పారుతున్నది. భారీ వర్షాలకు ధారూర్ మండలంలోని దోర్నాల్, నాగసమందర్, మంచన్ పల్లి వద్ద తాత్కాలిక వంతెనలు మరోసారి కొట్టుకుపోయాయి. సంగారెడ్డి జిల్లాలో వాగులో పడి ఇద్దరు మృతి చెందారు. గురువారం ఉదయం కూడా హైదరాబాద్‌లో పలు ప్రాంతాల్లో భారీ వర్షం పడింది. బుధవారం రాత్రి కేవలం 2 గంటల్లోనే 11 సెంటీమీటర్ల వర్షపాతం నమోదయ్యింది. ఆకాశానికి చిల్లు పడిందేమో అన్నట్టు జడివాన కురిసింది. ఉరుములు, మెరుపులతో, గాలి తోడుగా వర్షం బీభత్సం సృష్టించింది. లోతట్టు ప్రాంతాలను నీళ్లతో నింపేసి, రహదారులను ముంచేసి నగరవాసులను బెంబేలెత్తించింది. వరద ధాటికి హకీంపేట్, టోలిచౌకీ తదితర ప్రాంతాల్లో వాహనాలు కొట్టుకుపోయాయి. రాజధానిలో ఎక్కడ చూసినా మోకాళ్ల లోతు నీళ్లు నిండాయి. వాన ప్రభావానికి కొన్ని చోట్ల రోడ్డు కుంగిపోయింది. మరో ఐదు రోజులు భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశాలున్నాయని వాతావరణ శాఖ హెచ్చరించడంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఇకపోతే గ్రేటర్‌లో నాలాల వద్ద రెస్క్యూ సిబ్బంది క్లీన్ చేసే పనిలో పడ్డారు. భారీ వర్షానికి పలు చోట్ల రహదారులపై వరద నీరు నిలిచిపోయి ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. రోడ్లన్నీ చెరువులను తలపించాయి. గ్రేటర్‌లోని పాతబస్తీ బహదూర్‌పురా, చందూలాల్‌బరాదరిలో అత్యధికంగా 11సెంటీమీటర్ల వర్షపాతం నమోదవ్వగా పటాన్‌చెరు, మహేశ్వరంలో అత్యల్పంగా 1 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైనట్లు టీఎస్‌డీపీఎస్ అధికారులు వెల్లడించారు. ఈ నెల 20న మరో అల్పపీడనం ఏర్పడనుండడంతో రాగల ఐదు రోజులు గ్రేటర్‌లో భారీ నుంచి అతిభారీ వర్షాలు కురిసే అవకాశమున్నట్లు హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారులు హెచ్చరికలు జారీచేశారు.

### వాగులో పడి ఇద్దరు యువకుల మృతి

సంగారెడ్డి జిల్లాలో రాత్రి కురిసిన వర్షాలకు పొంగి పొర్లిన వాగులో పడి ఇద్దరు యువకులు మృతి చెందారు. ఈ విషాద ఘటన జిల్లాలోని జహీరాబాద్ మండలం సత్వార్ గ్రామంలో చోటు చేసుకుంది. బుధవారం గ్రామ పరిధిలో భారీ వర్షం కురిసింది. గ్రామానికి చెందిన రాజు (40), హద్నూర్ గ్రామానికి చెందిన రాజు (40) వాగులో పడి కొట్టుకుపోయారు. గురువారం ఉదయం గ్రామ శివారులోని ముళ్ల పొదల మధ్యలో మృత దేహాలను గుర్తించారు. ప్రమాద స్థలానికి చేరుకున్న పోలీసులు, రెవెన్యూ అధికారులు మృత దేహాలను జహీరాబాద్ దవాఖానకు తరలించారు.

### వాగులో కొట్టుకుపోయిన మహిళ మృతి

అల్పపీడ ప్రభావంతో రాష్ట్రంలో జోరుగా కురుస్తున్న వర్షాలకు వాగులు, వంకలు పొంగిపొర్లుతున్నాయి. వరదలకు రోడ్లు కొట్టుకుపోయి రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతున్నది. వికారాబాద్ జిల్లా అంతటా విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. మర్పల్లి మండలంలో కురిసిన వర్షానికి షాపూర్ వాగులో కొట్టుకుపోయిన అనితా బాయి అనే మహిళ మృతి చెందింది. అధికారులు ప్రజలను అప్రమత్తం చేస్తూ సహాయక చర్యల్లో నిమగ్నమయ్యారు.

### కాలువలో చిక్కున్న రైతులు క్షేమం

నాగర్ కర్నూల్ జిల్లా అచ్చంపేట మండలం, సిద్దాపూర్ దిండి కాలువలో చిక్కుకున్న ఇద్దరు రైతు దంపతులను ఎన్డీఆర్ఎఫ్ బృందం రక్షించింది. పొలంలో పనికోసం వెళ్లిన రైతు దంపతులు వాగు మధ్యలో చిక్కుకుపోయారు. ఒడ్డుకు చేరలేక ఇబ్బంది పడ్డారు. విషయం తెలుసుకున్న అధికారులు వెంటనే స్పందించారు. సంఘటనా స్థలానికి జిల్లా కలెక్టర్ శర్మన్, ఎస్పీ సాయి శేఖర్, ఉన్నతాధికారులు చేరుకున్నారు. ఎన్డీఆర్ఎఫ్ బృందాన్ని రంగంలోకి దింపి వారిని సురక్షితంగా ఒడ్డుకు చేర్చారు.

# ప్రధాని మోడీకి రాష్ట్రపతి, ఉపరాష్ట్రపతుల శుభాకాంక్షలు

### బర్త్‌డే విషెస్ చెబుతూ రాహుల్ ట్వీట్

న్యూఢిల్లీ,సెప్టెంబర్17(ఆర్ఎన్ఎ): జన్మదినం సందర్భంగా ప్రధానమంత్రి నరేంద్రమోదీకి రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్, ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. ప్రధాని మోదీ 70వ జన్మదినం సందర్భంగా రాష్ట్రపతి, ఉపరాష్ట్రపతి ట్విట్టర్ ద్వారా స్పందించారు. భగవంతుడు మిమ్మల్ని ఎల్లప్పుడూ ఆరోగ్యంగా, సంతోషంగా ఉంచాలని ప్రార్థిస్తున్నట్లు తెలిపారు. భారతదేశ జీవన విలువలు పాటిస్తూ, ప్రజాస్వామ్య సాంప్రదాయ ఆదర్శాన్ని ప్రదర్శిస్తూ దేశాన్ని అంతర్జాతీయంగా ఉన్నతస్థానానికి తీసుకెళ్లారని కొనియాడారు. మోదీ నాయకత్వంలో ఆత్మనిర్భరతతో కూడిన నవభారత నిర్మాణ స్వప్నం సాకారం దిశగా సాగుతుండటం ముదావహం అన్నారు. ప్రధాని నరేంద్ర మోదీకి కాంగ్రెస్ పార్టీ నాయకుడు రాహుల్ గాంధీ జన్మదిన శుభాకాంక్షలు తెలుపుతూ ట్వీట్ చేశారు. 70వ జన్మదినం జరుపుకుంటున్న మోదీకి ఆయా రాష్ట్రాల సీఎంలు, నాయకులు, సినీ, క్రీడా ప్రముఖులు పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలుపుతున్నారు. మోదీ బర్త్‌డే సందర్భంగా భారతీయ జనతా పార్టీ నాయకులు దేశ వ్యాప్తంగా పలు సేవా కార్యక్రమాలు చేపడుతున్నారు. 70 కేజీల లడ్డూను కూడా తయారు చేయించినట్లు బీజేపీ కార్యకర్తలు తెలిపారు.

# కాశ్మీర్‌లో భారీ ఎన్‌కౌంటర్

### ముగ్గురు ఉగ్రవాదులు..ఓ మహిళ మృతి

శ్రీనగర్,సెప్టెంబర్17(ఆర్ఎన్ఎ): జమ్ముకశ్మీర్‌లోని శ్రీనగర్‌లో గురువారం తెల్లవారుజామున భారీ ఎన్‌కౌంటర్ జరిగింది. భద్రతా దళాలకు, ఉగ్రవాదులకు మధ్య జరిగిన ఈ ఎన్‌కౌంటర్‌లో ముగ్గురు ఉగ్రవాదులు మృతి చెందారు. శ్రీనగర్‌లోని బటమలూ ప్రాంతంలో ఉగ్రవాదులు తలదాచుకున్నారన్న సమాచారంతో తెల్లవారుజామున 2.30 గంటల సమయంలో ఫిర్దౌసాబాద్ ప్రాంతంలో సీఆర్‌పీఎఫ్ కూంబింగ్ నిర్వహించింది. ఆ సమయంలో ఉగ్రవాదులు భద్రతా దళాలపై కాల్పులు జరిపారు. ఆత్మరక్షణలో భాగంగా ఆర్మీ కూడా ఎదురుకాల్పులకు దిగింది. భద్రతా దళాలపై ఉగ్రవాదులు కాల్పులు జరపడంతో కూంబింగ్ కాస్తా ఎన్‌కౌంటర్‌గా మారింది. ఈ కాల్పుల్లో ముగ్గురు ఉగ్రవాదులు మృతిచెందగా.. కౌన్సర్ రియాజ్ అనే మహిళ కూడా మృతి చెందింది. ఈ కాల్పుల్లో ఇద్దరు సిఆర్‌పీఎఫ్ జవాన్లు కూడా గాయపడ్డారని అధికారులు తెలిపారు. క్షతగాత్రులను ఆసుపత్రిలో చేర్చామని.. కూంబింగ్ ఆపరేషన్ ఇంకా కొనసాగుతోందని వారు తెలిపారు.

# కొవిడ్‌తో 382 మంది వైద్యులు మృతి

### పార్లమెంట్‌లో ప్రస్తావించకపోవడంపై ఐఎంఎ ఆగ్రహం
### వివరాలు లేవని తప్పించుకోవడంపై నిరసన

న్యూఢిల్లీ,సెప్టెంబర్17(ఆర్ఎన్ఎ): కరోనా వైరస్‌ను లెక్కచేయకుండా, విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన వైద్యుల గురించి కేంద్రం పార్లమెంట్‌లో ప్రస్తావించకపోవడం ఇండియన్ మెడికల్ అసోసియేషన్(ఐఎంఏ)కు ఆగ్రహం తెప్పించింది. ఈ అంశం రాష్ట్రాలపరిధిలోనిది కాబట్టి తమ వద్ద సమాచారం లేదని చెప్పడంపై అభ్యంతరం తెలిపింది. కరోనాతో పోరాటంలో అసువులు బాసిన మృతుల పట్ల ప్రభుత్వ ఉదాసీనతను నిందించింది. ఇలాంటి పరిస్థితుల్లో ప్రభుత్వం అంటువ్యాధుల చట్టం, విపత్తుల నిర్వహణ చట్టాన్ని నిర్వహించే నైతికతను కోల్పోతుందని మండిపడింది. అంతేకాకుండా విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన వైద్యుల జాబితాను ప్రచురిస్తూ..వారికి అమరులుగా పరిగణించాలని తన ప్రకటనలో డిమాండ్ చేసింది. కేంద్ర ఆరోగ్య శాఖ సహాయ మంత్రి అశ్విని కుమార్ చౌబే పార్లమెంట్‌లో ప్రకటన చేస్తూ..ప్రజారోగ్యం, ఆసుపత్రులు రాష్ట్రాల పరిధిలోకి వస్తాయని, అందువల్ల బీమా పరిహారానికి సంబంధించిన సమాచారం కేంద్రం వద్ద లేదని వెల్లడించారు. దాంతో ఆగ్రహానికి గురైన ఐఎంఏ..ప్రజల కోసం వైరస్‌కు ఎదురొడ్డి నిలబడిన జాతీయ వీరులను ప్రభుత్వం వదిలేసిందని విమర్శించింది. వైరస్ కారణంగా ఇప్పటి వరకు 382మంది వైద్యులు మరణించగా..అందులో 27 నుంచి 85 సంవత్సరాల వయస్సున్న వైద్యులు ఉన్నారని తెలిపింది. ఈ వివరాలను కేంద్రం వెల్లడించకపోవడం బాధాకరమని, భారత్ వలే ఏ దేశమూ ఇంతమంది వైద్యులు, ఆరోగ్య కార్యకర్తలను కోల్పోలేదని ఆ ప్రకటనలో ఆవేదన వ్యక్తం చేసింది. కాగా, కమ్యూనిటీ హెల్త్ వర్కర్లతో సహా దేశ వ్యాప్తంగా ఉన్న 22.12లక్షల మంది వైద్య సిబ్బందికి జాతీయ పథకం కింద కేంద్రం రూ.50లక్షల బీమా సౌకర్యాన్ని కల్పిస్తుందని మార్చిలో ఆరోగ్య మంత్రిత్వశాఖ వెల్లడించిన సంగతి తెలిసిందే. మరోవైపు, పార్లమెంట్ సమావేశాలు ప్రారంభమైన దగ్గరి నుంచి సభ్యులు లేవనెత్తిన ప్రశ్నలకు తమ వద్ద సమాచారం లేదని చెప్పి కేంద్రం విమర్శలకు గురికావడం ఇది రెండోసారి. లాక్‌డౌన్ కారణంగా ఎంతమంది వలసకార్మికులు ప్రాణాలు కోల్పోయారని అడిగిన ప్రశ్నకు కూడా సంబంధిత మంత్రిత్వ శాఖ తమ వద్ద సమాచారం అందుబాటులో లేదని చెప్పిన సంగతి తెలిసిందే.

# మోడీకి కెసిఆర్, జగన్ జన్మదిన శుభాకాంక్షలు

హైదరాబాద్,సెప్టెంబర్17(ఆర్ఎన్ఎ): ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ జన్మదినంసందర్భగా తెలుగు రాష్ట్రాల సిఎంలు శుభాకాంక్షలు తెలిపారు. ఆయన ఆయురారోగ్యాలతో ఉండాలని కోరుకున్నారు. ఈ మేరకు ప్రకటన వారు వేర్వేరుగా విడుదల చేశారు. తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి కె. చంద్రశేఖరరావు తెలంగాణ ప్రజల తరపున శుభాకాంక్షలు తెలిపారు. ఈమేరకు కేసీఆర్ మోదీకి ఓ సందేశాన్నిపంపారు. భగవంతుడి అనుగ్రహం మీకు ఎల్లవేళలా ఉండాలని, దేశానికి మరిన్ని సంవత్సరాల పాటు సేవ చేయాలని ఆకాంక్షించారు. ప్రధాని నరేంద్ర మోదీ పుట్టిన రోజు పురస్కరించుకొని ఏపీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ట్విటర్ ద్వారా గురువారం ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.'ప్రధాని మోదీజీ మీకు పుట్టినరోజు శుభాకాంక్షలు. ఇలాంటి పుట్టినరోజులు మరెన్నో జరుపుకోవాలని.. ఎల్లప్పుడు ఆయురా రోగ్యంతో ఉండాలని ఆ దేవుడిని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నానంటూ ట్వీట్ చేశారు. వైఎస్సార్‌సీపీ రాజ్యసభ ఎంపీ విజయసాయిరెడ్డి ప్రధాని మోదీకి ట్విటర్ ద్వారా శుభాకాంక్షలు తెలిపారు. 'దేశ సేవకు అంకితమైన మీరు ఇలాంటి పుట్టినరోజులు మరిన్ని జరుపుకోవాలని ఆ దేవుడిని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నా. దేశానికి మీలాంటి వ్యక్తి ప్రధానమంత్రిగా ఉండటం మాకు ఆశీర్వాదం అంటూ తెలిపారు. ఏపీ గవర్నర్ బిశ్వభూషణ్ హరిచందన్ గురువారం ప్రధాని నరేంద్ర మోదీకి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

## చరిత్రలో నేటినిజం



కం॥ అనలమ్మై అనిలమ్మై
అనయు మ్మాంగ్లేయుల పయి ననిసేయుంగన్
మను చుంఘును "రూపమ్మై
తన రెడి పోరాటమున "మదన్‌లాల్ డింగ్రా" !!

( సెప్టెంబర్ 18 దేశభక్తులు మదన్‌లాల్ డింగ్రా జయంతి..)

-రాధశ్రీ

సెల్: 9494481210



# ట్రాన్స్ జెండర్‌లకు నిత్యావసర సరుకుల కిట్టు

### -సైబరాబాద్‌లో ప్రారంభించిన సిపి సజ్జన్నార్

హైదరాబాద్,సెప్టెంబర్17(ఆర్ఎన్ఎ): గచ్చిబౌలిలోని సైబరాబాద్ కమిషనరేట్ కార్యాలయంలో నిత్యవసర వస్తువుల సరుకుల పంపిణీని సీపీ సజ్జనార్ గురువారం ప్రారంభించారు. ఎస్‌సీఎస్‌సీ ఆధ్వర్యంలో సీడ్స్, హనీవెల్ అనే స్వచ్ఛంద సంస్థల సహకారంతో నిత్యావసర సరుకుల పంపిణీకి శ్రీకారం చుట్టారు. దాదాపు 500 మంది ట్రాన్స్ జెండర్‌లకు నిత్యావసర సరుకుల కిట్టును అందజేశారు. గచ్చిబౌలిలోని సైబరాబాద్ కమిషనరేట్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ముఖ్య అతిథిగా విచ్చేసిన సీపీ సజ్జనార్ గ్రాసరీస్ పంపిణీనీ ప్రారంభించారు. ఈ సందర్భంగా సీపీ సజ్జనార్ మాట్లాడుతూ... నిత్యవసర వస్తువుల సరుకుల పంపిణీనీ ప్రారంభించడం చాలా సంతోషంగా ఉందన్నారు. సీడ్స్, హనీవెల్ ప్రతినిధులకు అభినందనలు తెలియజేశారు. ఎస్‌సీఎస్‌సీ సహకారంతో గత ఆరు నెలల నుండి ఎన్నో కార్యక్రమాలు చేపట్టామని తెలిపారు. 11 లక్షల ఫుడ్ ప్యాకెట్లను అందజేశామని...లక్షా 25 వేల గ్రాసరీస్ పంపిణీ చేశామని తెలిపారు. అలాగే రక్తదాన శిబిరాలు ఏర్పాటు చేశామని... ఎ÷-లాస్మా డొనేషన్ కార్యక్రమాలు చేశామని చెప్పారు. ట్రాన్స్ జెండర్స్ సమస్యలను పరిష్కారానికి కృషి చేస్తామన్న సీపీ ట్రాన్స్ జెండర్స్ కూడా సమాజంలో భాగమే వారిని చిన్నచూపు చూడవద్దని కోరారు. అందరికీ ఉపాధి అవకాశాలు కలిపించడానికీ తన వంతు ప్రయత్నం చేస్తానన్నారు.

# కోసి రైల్ మహాసేతుకు నేడు ప్రారంభం

### జాతికి అంకితం చేయనున్న ప్రధాని మోడీ
### బీహార్‌లో 12 భారీ రైల్వే ప్రాజెక్టులకు శ్రీకారం

న్యూఢిల్లీ,సెప్టెంబర్17(ఆర్ఎన్ఎ): చరిత్రాత్మక కోసి రైల్ మహాసేతు మెగా బ్రిడ్జిని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ శుక్రవారం జాతికి అంకితం చేయనున్నారు. బీహార్ రాష్ట్రానికి ప్రయోజనం కలిగించే విధంగా ప్రయాణికుల సౌకర్యాలకు సంబంధించి 12 రైలు ప్రాజెక్టులను ఆయన ప్రారంభించనున్నారు. వీటిలో కియుల్ నదిపై కొత్త రైల్వే బ్రిడ్జి, రెండు కొత్త రైల్వే లైన్లు, ఐదువిద్యుదీకరణ ప్రాజెక్టులు, ఒక ఎలక్ట్రిక్ కోమోటివ్ షెడ్, బర్హ్-భక్తియాంపూర్ మధ్య మూడో లైను ప్రాజెక్టు ఉన్నాయి. కోసి రైల్ మహాసేతును జాతికి అంకితం చేయడం బీహార్ చరిత్రలో ఒక పెద్ద మలుపుగా చెప్పుకోవచ్చు. దీంతో ఈప్రాంతం మొత్తం ఈశాన్య రాష్ట్రాలతో అనుసంధానం అవుతుంది. 1887లో నిర్మాలి , భాప్టాహి (సరియాఘడ్) మధ్య మీటర్‌గేజ్ లింక్ నిర్మించారు. భారీ వరదలు1934లో సంభవించిన భారత నేపాల్ భూకంపం కారణంగా ఈ రైలు వ్యవస్థ కొట్టుకు పోయింది. కోసి నది ప్రవాహం కారణంగా ఈ రైలు లింక్‌ను పునరుద్ధరించేందుకు చాలా కాలం ఎలాంటి ప్రయత్నాలూ జరగలేదు. 2003-2004 సంవత్సరంలో కోసి మెగా బ్రిడ్జిలైన్ ప్రాజెక్టును భారత ప్రభుత్వం మంజూరు చేసింది. కోసి రైల్ మహాసేతు పొడవు 1.9 కిలోమీటర్లు. దీని నిర్మాణ వ్యయం రూ. 516 కోట్లు. ఇండియా- నేపాల్ సరిహద్దులో ఈ బ్రిడ్జి వ్యూహాత్మకంగా ఎంతో కీలకమైనది. ఈ ప్రాజెక్టు కోవిడ్ మహమ్మారి సమయంలో పూర్తి అయింది. వలస కార్మికులు కూడా ఈ ప్రాజెక్టు పనులను పూర్తి చేయడంలో పాల్గొన్నారు. ఈ ప్రాజెక్టును జాతికి అంకితం చేయడంతో ఈ ప్రాంత ప్రజల 86 ఏండ్ల సుదీర్ఘకాల కల నెరవేరనున్నది. మహాసేతు ను జాతికి అంకితం చేయడంతోపాటు ప్రధానమంత్రి, సుపౌల్ స్టేషన్ నుంచి సహ్రస- అసన్ పూర్ కుఫాకు డెమో రైలును జెండా ఊపి ప్రారంభించనున్నారు. ఒకసారి రెగ్యులర్ రైలు సర్వీసులు ప్రారంభమైతే, ఇది సుపౌల్, అరారియా, సహర్స జిల్లాలకు ఎంతో ప్రయోజనకరంగా ఉండనుంది. కోల్ కతా, ఢిల్లీ, ముంబాయి వంటి సుదూర ప్రాంతాలకు ఈ ప్రాంత ప్రజలు చేరుకోవడానికి ఇది ఎంతో సులభ మార్గం కానుంది. ప్రధానమంత్రి హ్యాజీపూర్ -ఘోస్వార్- వైశాలి, అలాగే ఇస్లాంపూర్- నటేశర్‌లకు రెండు కొత్త రైల్వేలైన్ ప్రాజెక్టులను ప్రారంభించనున్నారు. అలాగే కర్ణౌతి- భక్తియార్‌పూర్ లింక్ బైపాస్, బర్హా-భక్తియార్‌పూర్ మధ్య మూడవ లైనును ప్రధాన మంత్రి ప్రారంభించనున్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ముజఫర్ పూర్- సీతామర్హి, కథిహార్- న్యూజల్పా యగురి, సమస్తిపూర్ -దర్భం గా-జయనగర్, సమస్థిపూర్- ఖగారియా, భగల్పూర్ - శివనారాయణ్‌పూర్ సెక్షన్ల రైల్వే విద్యుదీకరణ ప్రాజెక్టులనుకూడా ప్రారంభించనున్నారు.

# ఆక్రమణలకు పాల్పడుతోంది చైనానే..

### చైనా ఎత్తుగడులను గమనిస్తూ దీటుగా జవాబు
### రాజ్యసభలో ప్రకటన చేసిన రక్షణమంత్రి రాజ్‌నాథ్ సింగ్




న్యూఢిల్లీ,సెప్టెంబర్17(ఆర్ఎన్ఎ): చైనా చెప్పేదొకటి, చేసేదొకటని కేంద్ర రక్షణశాఖ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ అభిప్రాయపడ్డారు. చైనా రెచ్చగొట్టే చర్యలకు దీటుగా జవాబిస్తామని అన్నారు. భారత్-చైనా సరిహద్దుల్లో తాజా పరిస్థితులపై కేంద్ర రక్షణశాఖ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ రాజ్యసభలో కీలక ప్రకటన చేశారు. 1988 తర్వాత భారత్, చైనాలు అనేక ఒప్పందాలు చేసుకున్నాయని తెలిపారు. సరిహద్దు ఒప్పందాలను ఉల్లంఘించడమే ఇందుకు నిదర్శనమని రాజ్‌నాథ్ సింగ్ తెలిపారు. ఇది మంచి పద్ధతి కాదని ఆయన చైనాకు హితవు పలికారు. 1962లో లద్దాఖ్‌లో చైనా 38వేల చదరపు కి.మీ మేర ఆక్రమించిందని స్పష్టంచేశారు. అదే సమయంలో పాకిస్థాన్ నుంచి 5వేల చ.కి.మీ భూమిని తీసుకొందని పేర్కొన్నారు. అరుణాచల్‌ప్రదేశ్‌లోని వేల చ.కి.మీ భూభాగం తనదని చైనా వాదిస్తోందని అన్నారు. అయితే, ప్రస్తుతం లద్దాఖ్‌లో అనేక అభివృద్ధి పనులు జరుగుతున్నాయని రక్షణమంత్రి రాజ్‌నాథ్ రాజ్యసభకు తెలియజేశారు.

అరుణాచల్‌ప్రదేశ్‌లోని వేల చదరపు కి.మీ. భూభాగం తమదని చైనా వాదిస్తోందని చెప్పారు. 1988 తర్వాత భారత్-చైనా అనేక ఒప్పందాలు చేసుకున్నాయన్నారు. 1988 నుంచి 2003 వరకు రెండు దేశాల మధ్య సరిహద్దు ఒప్పందాలు చేసుకోవడం జరిగిందన్నారు. ఇప్పుడు ఆ ఒప్పందాలను చైనా ఉల్లంఘించడం సరికాదని రాజ్‌నాథ్ సింగ్ వ్యాఖ్యానించారు. సరిహద్దుల్లో శాంతియుత వాతావరణం ఉండాలని భారత్ కోరుకుంటోందని, చైనా మాత్రం సరిహద్దుల్లో భారత్‌ను కవ్విస్తోందని రాజ్‌నాథ్ సింగ్ పేర్కొన్నారు. చైనా బలగాల కవ్వింపులను భారత్ సైనికులు సమర్థవంతంగా అడ్డుకున్నారని అన్నారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ లద్దాఖ్ వెళ్లి భారత బలగాలకు భరోసా కల్పించారని చెప్పారు. చైనా బలగాల కదలికలపై నిఘా తీవ్రతరం చేశామన్నారు. ఎలాంటి పరిస్థితినైనా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉన్నామని రాజ్‌నాథ్ సింగ్ స్పష్టం చేశారు.

# ఆర్మీ వెంటే దేశం ఉంటుందన్న గట్టి సంకేతం

### చైనాను నిలువరించడంలో కలసికట్టుగానే ఉంటాం
### దండయాత్రల చరిత్ర, సంస్కృతి భారత్‌కు లేదన్న వెంకయ్య
### చైనా సరిహద్దు సమస్యలపై రాజ్‌నాథ్ ప్రకటనకు సంఘీభావం

న్యూఢిల్లీ,సెప్టెంబర్17(ఆర్ఎన్ఎ): వేల సంవత్సరాల చరిత్ర కలిగిన భారత్ .. ఎన్నడూ మరో దేశంపై దండయాత్ర చేయలేదని ఉపరాష్ట్రపతి, రాజ్యసభ చైర్మన్ వెంకయ్యనాయుడు తెలిపారు. దాడులు చేసిన చరిత్ర సంస్కృతి భారత్‌కు లేదన్నారు. వాస్తవాధీన రేఖ వద్ద ఉన్న పరిస్థితిపై రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ ప్రకటన చేసిన తర్వాత వెంకయ్య మాట్లాడారు. భారతీయ పరంపర, సంస్కృతి వసుధైక కుటుంబం అని, సర్వే జనా సుఖినోభవంతో అని మన ఇతిహాసాలు పేర్కొంటాయన్నారు. వేల సంవత్సరాల ఏళ్ల నుంచి మన దేశం .. ఏ దేశంపైనా దాడి చేయలేదన్నారు. అంతర్జాతీయ మీడియాలో భారత్‌పై వస్తున్న దుష్ప్రచా రాలను ఆయన కొట్టిపారేశారు. భారత్‌లో మత బేధాలు ఉన్నట్లు వచ్చిన వార్తలను వెంకయ్య తప్పుపట్టారు. ఓ అంతర్జాతీయ మ్యాగ్జిన్‌లో వచ్చిన కథనాన్ని ఆయన తన మాటల్లో ప్రస్తావించారు. చాలా అనర్థమైన విషయాలను ఆ కథనంలో రాసినట్లు వెంకయ్య తెలిపారు. మన దేశం నుంచి, మన సభ నుంచి ఇలాంటి సందేశం వినిపించారదన్నారు. మన అందరం కలిసి కట్టుగా సైన్యం వెంట ఉన్నామని చైర్మన్ వెంకయ్య తెలిపారు. ఈ నేపథ్యంలో రక్షణ మంత్రి రాజ్‌నాథ్‌కు సూచన చేశారు. ఎవరైనా సభ్యులు కానీ, అధికారులు కానీ ఈ అంశం గురించి చర్చించాలనుకుంటే.. వారితో వీలైతే ఏకాంతంగా కూడా మాట్లాడా లన్నారు. దేశ ఐక్యత, సమగ్రత అంశంలో అందరూ ఆసక్తిగా ఉంటారన్నారు. వాస్తవంగా ఎల్ఏసీ వద్ద ఉన్న పరిస్థితి ఏంటో తెలియాలని విపక్షాలకు ఉంటుందని, వారికి పూర్తి సమాచారాన్ని ఇవ్వాలని వెంకయ్య సూచించారు. విపక్ష సభ్యులను విశ్వాసంలోకి తీసుకుని వారికి ప్రభుత్వ విధానం తెలియచేయాలన్నారు. చైనాతో సరిహద్దు వివాదం నెలకొన్న విషయంలో రాజ్యసభలో రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ ప్రకటన చేశారు. వాస్తవాధీన రేఖ వద్ద చైనా దళాలు ఉద్రిక్తత వాతావరణాన్ని సృష్టిస్తున్నట్లు తెలిపారు. ఈ అంశంపై విపక్ష సభ్యులు కూడా తమ గళం వినిపించారు. ఆర్మీ వెంటే దేశం ఉంటుందని కాంగ్రెస్ ఎంపీ ఆనంద్ శర్మ అన్నారు. ఈ విషయంలో అందరం కలిసి కట్టుగా ఉన్నట్లు ఆయన స్పష్టం చేశారు. ఒకవేళ చర్చల ద్వారా సమస్య పరిష్కారం కాకుంటే, అప్పుడు ఏం చేస్తారని ఆయన ప్రశ్నించారు. సైనిక దళాలకు అండగా ఉంటామని కూడా ఇతర రాజ్యసభ ఎంపీలు తెలిపారు. ఐక్యత, సార్వభౌమత్వం విషయంలో దేశం ఒకటిగా ఉంటుందని రాజ్యసభ విపక్షనేత గులాం నబీ ఆజాద్ తెలిపారు. సియాచిన్ సైనిక పోస్టులను గతంలో చాలా సార్లు తాను విజిట్ చేసినట్లు ఆయన గుర్తు చేశారు. చైనా దళాలు తమ స్వంత స్థానానికి వెళ్లిపోవాలని ఆయన కోరారు. ఈ అంశంలో రాజ్యసభ సభ్యులందరూ సంఘీభావం ప్రకటిస్తున్నట్లు తెలిపారు. వివిధ పార్టీ ఎంపీలు సంఘీభావం ప్రకటించడం పట్ల రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ ప్రశంసించారు. నేను మీకు థ్యాంక్స్ చెప్పాలని భావించడం లేదు, ఎందుకంటే మనం అంతా ఒక్కటే అన్న సందేశాన్ని వినిపంచారన్నారు. మాజీ రక్షణమంత్రి ఏకే ఆంటోనీ చేసిన వ్యాఖ్యలకు రాజ్‌నాథ్ సమాధానం ఇస్తూ.. భారత దళాలను పెట్రోలింగ్ చేయకుండా చైనా అడ్డుకుంటుందన్నారు. అయితే తాము పెట్రోలింగ్ పద్ధతులను మార్చడం లేదని, మన భూభాగంలో పెట్రోలింగ్ నిర్వహించకుండా మన సైనికులను అడ్డుకునే శక్తి ఏదీ లేదన్నారు. కానీ చర్చలు మాత్రం కొనసాగుతూనే ఉంటాయన్నారు. ఎలక్ట్రానిక్ మీడియా వల్ల సరిహద్దుల్లో యుద్ధం లాంటి వాతావరణం నెలకొన్నదని సమాజ్‌వాదీ పార్టీ ఎంపీ రవి ప్రకాశ్ వర్మ ఆరోపించారు. దేశం యావత్ సైనిక దళాల వెంట ఉన్నదని, అయితే సార్వభౌమత్వం కాపాడుకుంటామని రక్షణ మంత్రి చెప్పడంలో అర్థం ఏముందని ఏకే ఆంటోని ప్రశ్నించారు.

# లక్ష డబుల్ ఇళ్ల నిర్మాణానికి కట్టుబడి ఉన్నాం

### కాంగ్రెస్ నేతలను వెంటేసుకుని తిరిగిన తలసాని
### కాంగ్రెస్ నేతలకు ఇళ్లను చూపించిన మంత్రి
### ఒక్క రోజుతోనే టూర్ అయిపోలేదని తలసాని వ్యాఖ్య

హైదరాబాద్,సెప్టెంబర్17(ఆర్ఎన్ఎ): లక్ష డబుల్ బెడ్ రూం ఇండ్లు నిర్మిస్తున్నామన్న ప్రతిపాదనకు కట్టుబడి ఉన్నామని రాష్ట్రమంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ స్పష్టం చేశారు. లక్ష ఇండ్లు చూపించే వరకు భట్టి విక్రమార్క వెంబడి తిరిగి చూపిస్తానని మంత్రి తేల్చిచెప్పారు. నగరంలోని జియగూడ, గోడ్షా ఖబీర్, ఇందిరాగాంధీ కాలనీ, బన్సీలాల్‌పేట, కట్టెలమండిలో నిర్మించిన డబుల్ బెడ్ రూం ఇండ్లను భట్టి విక్రమార్కకు మంత్రి తలసాని, మేయర్ బొంతు రామ్మోహన్ కలిసి చూపించారు. అనంతరం మంత్రి తలసాని మీడియాతో మాట్లాడారు. పేద వర్గాలు గొప్పగా బతకాలనే ఉద్దేశంతోనే సీఎం కేసీఆర్ ఈ పథకాన్ని ప్రతిష్టాత్మకంగా తీసుకున్నారని తెలిపారు. డబుల్ బెడ్ రూం ఇండ్లను ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలకే కేటాయిస్తున్నామని చెప్పారు. ఈ ఇండ్లను సీఎం కేసీఆరే డిజైన్ చేశారని గుర్తు చేశారు. హైదరాబాద్‌లో మొత్తం 60 ప్రాంతాల్లో ఇండ్లు నిర్మిస్తున్నామని తెలిపారు. ఇవాళ చూసింది చాలా తక్కువ అని తెలిపారు. భారతదేశ చరిత్రలో ఎన్నడూ లేని విధంగా రాష్ట్ర ప్రభుత్వం డబుల్ బెడ్ రూం ఇండ్లు నిర్మిస్తున్నామని చెప్పారు. ఒక్కో ఇంటి విలువ రూ. కోటి వరకు ఉంటుందన్నారు. డబుల్ బెడ్ రూం ఇండ్ల నిర్మాణంలో ఎలాంటి లోపాలు లేకుండా నిర్మిస్తున్నామని చెప్పారు. లక్ష ఇండ్ల నిర్మాణాల కోసం ప్రభుత్వం రూ. 10 వేల కోట్లు ఖర్చు పెడుతుందన్నారు. కొల్లూరులో 15 వేల ఇండ్లు నిర్మించాం. అవి ప్రారంభానికి సిద్ధంగా ఉన్నాయని పేర్కొన్నారు. వీలైనంత త్వరగా ఈ ఇండ్లను పూర్తి చేసి పేదవారికి పంపిణీ చేయాలని ప్రభుత్వం ముందుకెళుతుందన్నారు. లబ్దిదారులు ఎంతో సంతోషంగా ఉన్నారు. బస్తీల సమక్షంలోనే ఇండ్లను పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. ఇండ్ల పంపిణీలో ఎలాంటి రాజకీయ ప్రమేయం ఉండదని స్పష్టం చేశారు. డిమాండ్ ఉన్న చోట భవిష్యత్‌లో ఇలాంటి ఇండ్లను నిర్మిస్తామన్నారు. ఏ పార్టీలైనా పేదల సంక్షేమమే కోరుకుంటుందని మంత్రి తలసాని చెప్పారు. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో ప్రభుత్వం నిర్మిస్తున్న డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లను పశుసంవర్ధకశాఖమంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్‌తో కలిసి సీఎల్పి నేత భట్టి విక్రమార్క, మాజీ ఎంపి వి.హన్మంతరావు పరిశీలించారు. నగరంలోని వివిధ ప్రాంతాల్లో నిర్మిస్తోన్న రెండుపడకల ఇండ్ల విషయంలో శాసన సభలో జరిగిన చర్చలో భట్టి విక్రమార్క చేసినసవాల్‌ను మంత్రి తలసాని స్వీకరించారు. హైదరాబాద్‌లో లక్ష డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లు ఎక్కడ కట్టారో చూపించాలని భట్టి డిమాండ్ చేశారు. దీనికి స్పందించిన మంత్రి తలసాని అబిడ్స్ కట్టెలమండిలో నిర్మిస్తున్న ఇళ్లను వారికి చూపించారు. ప్రభుత్వానికి ఎన్నికల్లోనే డబుల్‌బెడ్‌రూమ్ ఇళ్లు గుర్తుకు వస్తాయని భట్టి విమర్శించగా ఆ సవాల్‌ను స్వీకరించిన మంత్రి తలసాని నగరంలో జరుగుతున్న ఇండ్లనిర్మాణం ఏ విధంగా జరుగుతోందో భట్టి, విహెచ్‌లకు వివరించారు. ఈ సందర్భంగా కార్యక్రమంలో నగర మేయర్ బొంతు రామ్మోహన్ ఇతర ఉన్నతాధికారులు ఉన్నారు.

# ప్రత్యామ్నాయా ఉపాధి కోసం ఎదురుచూపు

నేటి నిజం
శుక్రవారం 18-9-2020

కరోనా, లాక్‌డౌన్ పరిణామాలు ఇంకా తొలగి పోలేదు. ప్రజలు కరోనాతో పోరాడుతూనే ఇప్పుడు ప్రత్యామ్నాయ ఉపాధి మార్గాలు వెతుక్కోవాల్సి వస్తోంది. ప్రభుత్వాలు చేతులెత్తేయడంతో పాటు పట్టించుకునే పాపాన పోవడం లేదు. బియ్యం,నిత్యాసవరాలు పంపచామని, నగదు పంపిణీ చేశామని గొప్పలు చెప్పడం మినహా ప్రజల ఆర్థిక అవసరాలకు అనుగుణంగా ముందుకు రావాడం లేదు. అలాగే విద్యుత్, ఎల్ఆర్ఎస్, నల్లా బిల్లులు లాంటి వడ్డింపులు యధావిధిగానే పడ్డాయి. విద్యుత్ బిల్లులు మోత మోగించారు. ఈ దశలో వివిధ వృత్తుల్లో ఉన్న వారు ఇతరత్రా ఉపాధి బాట కోసం వెతుకుతున్నారు. దీనికి సామాజిక మాధ్యమాలను కూడా ఆశ్రయిస్తున్నారు. కొందరు మహిళలు ఇళ్లల్లో ఇప్పుడు మాస్కుల తయారీని చేపట్టి ఉపాధి పొందుతున్నారు. సబ్బులు,శానిటైజర్లు, హ్యాండ్ వాష్ వంటి అమ్మకాలు రోడ్‌సైడ్ వ్యాపారంగా మారాయి. పళ్లు కూరగాయల అమ్మకాలు కూడా రోడ్డుపక్కన చేరి అమ్ముతున్నారు. ఇవి గాకుండా ఇంకా ఎలాంటి ప్రయత్నాలు చేస్తే తమకు ఉపాధి దక్కుతుందన్న ప్రశ్న ఇప్పుడు అందరినీ వేధిస్తోంది. అందుకే ప్రతి ఒక్కరూ కరోనాతో పోరాడుతూనే..మాస్కులు ధరిస్తూనే ఉపాధి కోసం వెతుకులాటలో ఉన్నారు. ఆర్థిక వెనుకబాటుకు తోడు ఫ్యాక్టరీల మూత, నిర్మాణరంగం నిలిచిపోత వంటివి పట్టణ ప్రజల్ని, వారి జీవితాల్ని అతలాకుతలం చేశాయి. మిల్లుల్లో ఉపాధి కోల్పోయిన వారు హోటళ్లు, బట్టల షాపులు, ఎటిఎం, ప్రైవేట్ స్కూళ్లు, ఆసుపత్రుల దగ్గర సెక్యూరిటీ గార్డులుగా చేరి కుటుంబాలను పోషించుకున్న వారంతా రోడ్డున పడ్డారు. కరోనా దెబ్బకు హోటళ్లు, సినిమా థియేటర్లు, షాపులు, షాపింగ్ లక్షవేలాది మంది కార్మికులకు ఉపాధి లేకుండా పోయింది. వీటిపై ఆధారపడి రవాణారంగం ఆటో, క్యాబ్‌లు, టాటా ఏసి, లారీ, వ్యాన్లు తదితర వాహనదారులకు పనిలేకుండా పోయింది. స్వర్ణకారులు వాయిద్యకారులు, ఇంటిపని వారు, చెప్పులు కుట్టుకునేవారు, మ్యాంగో సరఫరా చేసేవారు, వంట మాష్టర్లు, మేదర్లు, కుమ్మర్లు, వీధి భాగోతాలు వేసే కళాకారులు, జానపద కళాకారులు, పాత ఇనుప సామాన్లు, గాజు సీసాలు సేకరించి అమ్మేవారు, పాత సామాన్ల షాపుల్లో పని చేసేవారు, హోమ్ నీడ్స్ ఇంటింటికి వెళ్ళి అమ్మేవారు, కుటీర పరిశ్రమల్లో చేగోడీలు, పప్పు ఉండలు, జీడిపప్పు తయారీ కంపెనీల్లో పనిచేసేవారు, సిల్వరు కంపెనీల్లో పని చేసే కార్మికులు, టైలర్లు, ఫొటోగ్రాఫర్లు ఇలా సుమారు వందకుపైగా వృత్తులు చేసుకొని బతికే ప్రజలు ఉపాధి లేకతో కుటుంబాలను పోషించే వారి జాబితాలు తీసి వారికి ప్రత్యామ్నాయ ఉపాధి చూపాల్సిన ప్రభుత్వాలు మిన్నకుండి పోయాయయి. ఉపాధి పోయి ఆరు నెలలైంది. చిన్నాచితకా యజమానులు జీతాలివ్వడంలేదు. చేతిలో ఉన్నదంతా ఖర్చయి పోయింది అప్పులు దొరకడంలేదు. దీంతో సామాన్యుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. ఇంజనీరింగ్ చదివి ఐటి కంపెనీల్లో పనిచేసే అనేకమంది వ్యవసాయ కూలీలుగా మారారు. పెయింటింగ్ కూలికి పోతున్నా.. నిర్మాణ రనరంగం కుదేలవ్వడంతో అక్కడకూడా పని దొరకడం లేదు. షాపింగ్‌మాల్స్, బట్టలషాపులు రెండు నెలలు పూర్తిగా మూతపడ్డాయి. అద్దెకు కూడా కట్టలేక కుటుంబ పోషణ అగమ్య గోచరంగా మారింది. వీరంతా ఇప్పుడు ఎవరైనా తమకు ప్రత్యామ్నాయ ఉపాధి చూపుతారా అని ఎదురు చూస్తున్నారు. భవననిర్మాణ కార్మికులకు గతంలో ఇసుక సమస్యతో 5 నెలలు.. కరోనాతో మరో ఆరు నెలలు మొత్తం 11 నెలలుగా పనే లేదు. ఏం చేయాలో తెలీక బ్రాందీ షాపుల ముందు మహిళా కూలీలు సైతం రోడ్డెక్కి పని కోసం ఎదురుచూస్తున్నారు. ఇళ్లల్లో పాచిపని చేసుకునే రోడ్డున పడ్డారు. గుడిలో పూజార్లకి దక్షిణతో పాటు కొబ్బరికాయ రూపంలో ఉపాధి ఉండేది. అది కూడా పోయింది. పూజలు పునస్కారాలు ఆగాయి. పౌరోహిత్యం చేసుకునే వారు, పూజలు చేసుకునే వారు ఉపాధి కోసం ఎదురు చూస్తున్నారు. వివిధ రకాల వ్యాపకాల వారిపైనా కరోనా పంజా విసిరింది. కరోనాతో ఇప్పుడు ఇళ్లల్లో పనులకు ఎవరినీ పెట్టుకోవడం లేదు. కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన సహాయం, రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన రూ.10 వేల సహాయం కొందరికే అందింది. ట్యాక్సీ, టాటా ఏసి, క్యాబ్, లారీ తదితర మోటారు వాహనాలు నడుపుకొని బతికేవారి పరిస్థితి మరీ దుర్భరంగా మారింది. లాక్‌డౌన్ ఎత్తేసినా రోడ్డు పైకి వచ్చి టాక్సీలు నడిపే పరిస్థితి లేదు. రోడ్డు మీదకు వచ్చి ఆటో వేస్తే ఎక్కేవారు ఇద్దరే. ఎక్కువ మంది ఎక్కితే కేసులు. వచ్చేది తక్కువ, కేసులకు కట్టేది ఎక్కువ. మహిళలకు ఉపాధి కల్పించా లని, ఇంటి పని కార్మికులకు రూ.10 వేల చొప్పున ఇవ్వాలని డిమాండు చేస్తూ వందలాది మంది ఇప్పటికీ కోరుతూనే ఉన్నారు. కళ్యాణ మండపాలు మూతపడడం, శుభకార్యాలు ఆగిపోవడంతో పని కోల్పోయిన వంటపని కార్మికులు బాధలు కూడా వర్ణనాతీతంగా ఉన్నాయి. ఇలా వివిధ రంగాల్లో ఉపాధి కోల్పోయిన వారు దేశవ్యాప్తంగా కోట్లల్లో ఉన్నారు. వారంతా ఇప్పుడు ఎలాంటి ఆసరా దొరుకుతుందా అని ఎదురు చూస్తున్నారు. తమకు ప్రత్యామ్నాయంగా ఏదైనా ఉపాధి దక్కుతుందా అని చూస్తున్నారు. వ్యవసాయ, అనుబంధ రంగాలను పటిష్టం చేస్తే వేలాదిమందికి ఉపాధి దక్కగలదు. ఇప్పటికే కూలీల కొరతలను ఎదుర్కొంటున్న ఈ రంగంలో వీరిని చేర్పించే యత్నాలు చేయాల్సి ఉంది. చిన్నతరహా పరిశ్రమలకు ప్రోత్సాహం ఇస్తే మరింత మందికి ఉపాధి దక్కగలదు. వ్యవసాయ అనుబంధరంగాలకు ప్రోత్సాహం పెంచాలి. ఈ తరహా ఆలోచనలతో ప్రభుత్వం ప్రజలకు ఉపాధి కల్పించే మార్గాలను తెరవాలి.

## విద్యుత్ వినియోగదారులకు గుడ్ న్యూస్

### –కన్జ్యూమర్ మూవ్ డ్రాఫ్ట్ సిద్ధం

న్యూఢిల్లీ,సెప్టెంబర్17(ఆర్ఎన్ఎ): మోదీ ప్రభుత్వం విద్యుత్ వినియోగదారులకు తీపికబురు అందించేందుకు రెడీ అవుతోంది. కొత్త విద్యుత్ చట్టం తీసుకుని వచ్చే వేళ విమర్శలు ఎదురవుతున్నాయి. తెలంగాణ అసెంబ్లీ బిల్లును వ్యతిరేకిస్తూ ఏకగ్రీవ తీర్మానం చేసింది. ఈ దశలో ప్రజల్ల భరోసా కల్పించే ప్రయత్నాలకు పూనుకుంటున్నారు. దీపావళి నాటి కల్లా గుడ్ న్యూస్ అందించబోతోందన్న వార్తను ప్రచారం చేస్తున్నారు. ఎలక్ట్రిసిటీ కన్స్యూమర్ల కోసం కొత్త రూల్స్ తీసుకురాబోతున్నట్లు కేంద్ర విద్యుత్ శాఖ తెలిపింది. దీని కోసం ఇప్పటికే డ్రాఫ్ట్ రూపొందించామని పేర్కొంది. ప్రోకన్సూమర్ మూవ్ డ్రాఫ్ట్ ఎలక్ట్రిసిటీ పేరుతో ఈ డ్రాఫ్ట్‌ను తీసుకువచ్చింది. కొత్త డ్రాఫ్ట్ ప్రకారం.. వినియోగదారులు కొత్త కనెక్షన్ కోసం ఎక్కువ రోజులు వేచి చూడాల్సిన పని లేదు. కేవలం రెండు డాక్యుమెంట్లతోనే 10 కేడబ్ల్యూ లోడ్ కనెక్షన్ పొందొచ్చు. ఇంకా 150 కేడబ్ల్యూ కనెక్షన్ వరకు ఎలాంటి డిమాండ్ చార్జీలు చెల్లించాల్సిన పని లేదు. మెట్రో నగరాల్లో అయితే 7 రోజుల్లో కనెక్షన్ అందించాలి. మున్సిపల్ ఏరియాల్లో 15 రోజుల్లోగా, గ్రామీణ ప్రాంతాల్లో అయితే 30 రోజుల్లోపు కొత్త కనెక్షన్ ఏర్పాటు చేయాలి. అంతేకాకుండా కరెంటు బిల్లును చెల్లించేందుకు క్యాష్, చెక్ బుక్, డెబిట్ కార్డు, క్రెడిట్ కార్డు, నెట్ బ్యాంకింగ్ ఇలా అన్ని పేమెంట్ ఆప్షన్స్ అందుబాటులో ఉండాలి. ఇక బిల్లు రూ.1,000 దాటితే ఆన్‌లైన్‌లోనే చెల్లించాల్సి ఉంటుంది. ఒకవేళ బిల్లు 60 రోజులు ఆలస్యంగా వస్తే అప్పుడు బిల్లు మొత్తంలో 5 శాతం వరకు తగ్గింపు లభిస్తుంది.

## బల్లి దుర్గాప్రసాదరావుకు వైకాపా నివాళి

### –ఎపి భవన్‌లో తొలి ఎంపిల సంతాపం

న్యూఢిల్లీ,సెప్టెంబర్17(ఆర్ఎన్ఎ): తిరుపతి లోక్‌సభ సభ్యుడు బల్లి దుర్గాప్రసాదరావుకి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎంపీలు నివాళులు అర్పించారు. ఏపీ భవన్‌లోని అంబేద్కర్ ఆడిటోరియంలో గురువారం ఉదయం బల్లి దుర్గాప్రసాద్ సంతాప సభ జరిగింది. ఈ సందర్భంగా పార్టీ ఎంపీలు విజయసాయిరెడ్డి, పెద్దిరెడ్డి మిథున్ రెడ్డి, వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, సత్యవతి, గోరంట్ల మాధవ్, పోచ బ్రహ్మానందరెడ్డి, లావు శ్రీకృష్ణదేవరాయలు, అయోధ్య రామిరెడ్డి, బెల్లాన చంద్రశేఖర్ , తలారి రంగయ్య, ఏపీ భవన్ ఉన్నతాధికారులు అభయ త్రిపాఠి, భావన సక్సేనా, రమణారెడ్డి తదితరులు అంజలి ఘటించారు. ఈసందర్భంగా ఎంపీ మాగుంట శ్రీనివాసులు రెడ్డి మాట్లాడుతూ.. 'బల్లి దుర్గాప్రసాద్‌తో తనకు వ్యక్తిగత అనుబంధం ఉంది. ఆయన 28 ఏళ్లకే రాజకీయ జీవితంలో ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. ప్రతిసారి నా ఆశీస్సులు తీసుకునేవారు. ఆయన కుటుంబానికే కాదు, నాకు కూడా ఈ మరణం వ్యక్తిగతంగా లోటు. పార్లమెంట్‌లో అందరితో కలివిడిగా, కలుపుగోలుగా ఉండేవారు. ఎవరు ఏ సహాయం అడిగినా వెంటనే సిద్ధంగా ఉండేవారు.' అని తెలిపారు. బల్లి దుర్గాప్రసాద్ ఏదైనా భోళాగా మాట్లాడే మనిషి. నిరంతరం ప్రజల కోసం పనిచేసే వారు. ఆయన అకాల మరణం పార్టీకి ప్రజలకు తీరని లోటు' అని ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయులు అన్నారు. సహచర ఎంపీ దుర్గాప్రసాద్ మరణం అందరినీ ఎంతో బాధించిందని, ఆయన కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలుపుతున్నామని అనకాపల్లి ఎంపీ సత్యవతి పేర్కొన్నారు.

## దేవాలయ భూముల ఆక్రమణలకు పాల్పడితే ఖబర్దార్

### –హెచ్చరించిన మంత్రి తలసాని శ్రీనివాసయాదవ్

హైదరాబాద్,సెప్టెంబర్17(ఆర్ఎన్ఎ): ప్రభుత్వ, దేవాలయ భూముల ఆక్రమణలకు పాల్పడే వారిని ఉక్కుపాదంతో అణచివేస్తామని పశుసంవర్ధకశాఖ మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ హెచ్చరించారు. బుధవారం గోషామహల్ నియోజక వర్గపరిధిలోని బేగంబజార్ డివిజన్‌మహారాజ్‌గంజ్‌లో గల రఘునాథ్‌స్వామి ఆలయాన్ని దేవాదాయశాఖ అధికారులతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణంలో శిధిలావస్థలో ఉన్న నిర్మాణాలు పరిశీలించి ఆలయ అభివృద్ధికి తనవంతు సహాయ సహకారాలు అందించేందుకు కృషి చేస్తానని ట్రస్ట్ సభ్యులకు హామీ ఇచ్చారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ ఎన్నో సంవత్సరాలుగా మహేశ్వరి సమాజ్ ఆధ్వర్యంలో వంశపారంపర్యంగా నిర్వహిస్తూ వస్తున్నారని వివరించారు. కొందరు ప్రైవేట్ వ్యక్తులు దేవాలయ భూములను ఆక్రమించేందుకు తప్పుడు సమాచారంతో కోర్టులలో కేసులు వేస్తున్నారని, అలాంటి వారిపట్ల కఠిన చర్యలు తీసుకుంటామని అన్నారు. ఇప్పటికే కోర్టుల్లో ఉన్న కేసుల్లో క్లియరెన్స్ వచ్చిందని తెలిపారు. వారం రోజులలో దేవాదాయ, మహేశ్వరి సమాజ్ సభ్యులతో సమావేశం నిర్వహిస్తామని చెప్పారు. దాతల సహకారంతో ఆలయ సమగ్ర అభివృద్ధికి చర్యలు తీసుకుంటామని మంత్రి తలసాని చెప్పారు. ఆలయ అభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యలపై ఒక నివేదికను రూపొందించాలని మహేశ్వరి సమాజ్‌సభ్యులకు మంత్రి ఆదేశించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ శంకర్ యాదవ్, పరమేశ్వరి సింగ్, దేవాదాయశాఖ డిప్యూటీ కమిషనర్ రామకృష్ణ, అసిస్టెంట్‌కమిషనర్ బాలజీ, ఆలయ ఈవో మహేందర్, మహేశ్వరి సమాజ్‌సభ్యులు పాల్గొన్నారు.

## తిరుపతి ఎంపి దుర్గాప్రసాద్ కన్నుమూత

### కరోనా చికిత్స పొందుతూ గుండెపోటుతో మృతి

### దిగ్భ్రాంతి వ్యక్తం చేసిన సిఎం జగన్ తదితరులు

చెన్నై,సెప్టెంబర్17(ఆర్ఎన్ఎ): తిరుపతి ఎంపీ బల్లి దుర్గాప్రసాద్(64) బుధవారం కన్నుమూశారు. ఇటీవల కరోనా వైరస్ బారిన పడిన ఆయన చెన్నైలోని ప్రైవేటు ఆస్పత్రిలో చేరారు. చికిత్స పొందుతుండగా బల్లి దుర్గాప్రసాద్‌కు తీవ్ర గుండెపోటు రావడంతో ఆయన ఈరోజు తుదిశ్వాస విడిచారు. బల్లి దుర్గాప్రసాద్ 28 ఏళ్లకే తొలిసారిగా ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. నెల్లూరు జిల్లా గూడురు నియోజకవర్గం నుంచి నాలుగుసార్లు ఎమ్మెల్యేగా, ఒకసారి మంత్రిగా పనిచేశారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో బల్లి దుర్గాప్రసాద్ స్వస్థలం నెల్లూరు జిల్లా వెంకటగిరి. 1985లో రాజకీయాల్లోకి ప్రవేశించిన ఆయన.. 1994లో చంద్రబాబు కేబినెట్‌లో విద్యాశాఖ మంత్రిగా పనిచేశారు. అనంతరం 2019 ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీలో చేరి తిరుపతి ఎంపీగా ఎన్నికయ్యారు. 2,28,376 ఓట్ల మెజార్టీతో ఘన విజయం సాధించారు. ఆయన మృతికి సిఎం జగన్ సహా వైకాపా నేతలు దిగ్భ్రాంతికి గురయ్యారు. బల్లి దుర్గాప్రసాద్ మరణం పట్ల ముఖ్యమంత్రి వైఎస్ జగన్ సంతాపం వ్యక్తం చేశారు. దుర్గాప్రసాద్ కుమారుడితో ఫోన్‌లో మాట్లాడిన సీఎం వైఎస్ జగన్.. ఎంపీ కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఎంపీ బల్లి దుర్గా ప్రసాద్ అకాల మరణం బాధాకరమని తిరుపతి ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి పేర్కొన్నారు. 'ఆయన మంచి మేధావి. రెండు దశబ్దాలుగా ప్రజా జీవితంలో వున్నారు. ఎప్పుడు ప్రజల కోసం పరితపిస్తుంటారు. ఆయన మృతి తీరని లోటు. తిరుపతి అభివృద్ధిలో ఎంపీ బల్లి దుర్గా ప్రసాద్ చెదరని ముద్ర వేసుకున్నారు. ఆయన కుటుంబానికి ప్రగాఢ సానుభూతి' అని సంతాపం ప్రకటించారు.

# ఆక్రమిత భూములకు విముక్తి ఎప్పుడో?

### సమస్యలు ఎలా పరిష్కరిస్తారో చెప్పని అధికారులు
### కొత్త చట్టంపై అప్పుడే మొదలైన చర్చలు

హైదరాబాద్,సెప్టెంబర్17(ఆర్ఎన్ఎ): కొత్త రెవెన్యూ చట్టంలో భూదాన భూములు, దేవాదాయ భూములు, వక్ఫ్ భూముల ఆక్రమణలను ఎలా తేలుస్తారన్న హామీ కనిపించిదం లేదు. ఎప్పటిలోగా వాటిని స్వాధీనం చేసుకుంటారో తెలియడం లేదు. లక్షలాది ఎకరాల ఆక్రమణలు ఎలా తొలగిస్తారన్నది అధికారులు కూడా స్పష్టం చేయడం లేదు. తెలంగాణ ముఖ్యమంత్రి కెసిఆర్ ఏది చేసినా బాగా ఆలోచించి.. ముందుచూపుతో పాటు, గతానుభవాలను బాగా ఆలోచించి చేస్తారు. అలా సమస్యలపై పట్టు సంపాదించి తను అనుకున్న ఫలితం వచ్చేదాకా పనిచేస్తారు. అలాగే తను చేపట్టిన పనిని స్వయంగా ప్రతిపాదించి ప్రచారంలోకి తెస్తారు. అధికారులతో మాట్లాడం నభలో వివరించడం,సంబంధిత ఉద్యోగులోకి తీసుకు పోవడం ఒక క్రమ పద్దతిలోపాటించి మార్పునకు శ్రీకారంచుడతారు. ఇటీవల రెవెన్యూ శాఖలో మార్పులకు సంబంధించి తీసుఎకుని వచ్చిన బిల్లు ఈ కోవలోకే వస్తుంది. అయితే అనేక సందేహాలు ఇప్పుడు వెల్లగా బయులు దేరుతున్నాయి. దేవాదాయ,వక్ఫ్ భూముల రిజిస్ట్రేషన్లు లాక్ చేస్తున్నట్లు ప్రకటించారు. అయితే ఆక్రమణలో ఉన్న ఈ భూములను వెనక్కి తీసుకునే ప్రకటన మాత్రం చేయలేదు. వాటిని ఎప్పటిలోగా,ఏ విధంగా స్వాధీనం చేసుకుంటారో స్పష్టత ఇవ్వడం లేదు. కొత్త చట్టాల వల్ల కలిగే ప్రయోజనాలు పరిమితులు ఏమిటన్నది ప్రధాన ప్రశ్నగా కనిపిస్తుంది. వేగం పెరగడానికి అవినీతి తగ్గడానికి పునరావృతి నివారించడానికి ఇదిదోహదం చేస్తుందన్న భావన సాధారణంగా వుంది. అధికారంలోకి వచ్చిన నాటి నుంచి సమగ్ర సర్వే గురించి మాట్లాడుతున్న కెసిఆర్ ప్రభుత్వం ఆ పనిచేయలేకపోయింది.

ఈ కాలంలోనూ అనేక ఆక్రమణలు ఆరోపణలు వున్నాయి. కుంభకోణాలు కుదిపేసినా చివరిదాకా వెళ్లింది లేదు. రాష్ట్రంలో సాగు భూములు కోటి అరవై మూడు లక్షల ఎకరాలైతే ఇందులో 15.5 లక్షల ఎకరాలు భూదాన దేవాదాయ వక్ఫ్ చెరువు అబాధీ ఫారెస్టు బంజరు వంటివి వున్నాయని రైతు నాయకులు చెబుతున్నారు. విద్యుత్ ఇరిగేషన్ భూములు కూడా వున్నాయి, ఇందులో అధిక భాగం బడాబాబుల ఆక్రమణలో వున్నాయి. సాగుభూములు రైతుల చేతిలో వున్నాయి. తెంగాణ పోరాట నేపథ్యంలో పూర్వపు హైదరాబాద్ శాసనసభ దేశంలోనే అత్యంత విప్లవాత్మకమైన రక్షిత కౌలుదారు చట్టం 1951లో తీసుకొచ్చింది. కెసిఆర్ ప్రభుత్వం కౌలుదారు ను వాస్తవ సాగుదార్లను గుర్తించబోనని ప్రకటించింది. రికార్డునుంచి తొలగించింది. దాదావు 20లక్షల కౌలుదార్లు ప్రభుత్వ పథకాలకు అనర్హులుగా మారారు. తెలంగాణలో చలామణిలో వున్న సాదాబైనామాలు 12.5 లక్షల దరఖాస్తులు రాగా కేవలం1.3 లక్షలు మాత్రమే పరిష్కరించి మిగిలినవి పెండింగులో పెట్టారు. ఇప్పటి వరకూ పనిచేసిన రెవెన్యూ కోర్టులు ముందు 16 వేల కేసులకు పైగా పెండింగులో వున్నాయి. వీటికోసం వెయ్యికి ఒకటి చొప్పున ఫాస్ట్‌ట్రాక్, రెవెన్యూ కోర్టు పెట్టి తేల్చేసి వాటిని రద్దు చేస్తారు. భవిష్యత్‌లో సివిల్ కోర్టులనే ఈ వివాదాలు పరిష్కరించుకోవాల్సి ఉంటుందని అన్నారు. ఇకపైన రెవెన్యూ అధికారులకు విచక్షణాధికారం వుండబోదని, వారి నిర్ణయాలను ప్రశ్నించే అవకాశం వుండదని చెబుతున్న మాటల్లో అంత సులభమైన పద్దతి కనపడడం లేదు. ఇందులోనూ చాలా సమస్యలున్నాయి. కుటుంబ వారసత్వాలు కూడా వారి మాట మీదనే చేస్తామన్నప్పుడు పౌరబాట్ల నవరణ ఎలాగన్నది ప్రశ్న కాబోతుంది. వాటిని ఒప్పందం ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకుంటే మ్యుటేషన్ చార్జిలు చెల్లించాలని నిబంధన చేర్చారు. సబ్ రిజిస్ట్రార్లు వ్యవసాయేతర భూములే రిజిస్టర్ చేసుకుంటారు. తహసిల్దారు మున్సిపాలిటీలో రిజిస్ట్రేషన్ అధికారం ఇవ్వడం వల్ల అవినీతి తగ్గి ఒకేసారి మ్యూటేషన్ జరిగిపోతుందన్నా.. ఇంకా చాలా రకాల సమస్యలు వుంటాయని నిపుణులు చెబుతున్నారు. కొత్త చట్టంలో మంచిని ఆహ్వానిస్తూనే కొత్త సవాళ్లను ఎదుర్కొవడానికి కొత్త సమస్యలు పరిష్కరించు కోవడానికి సిద్ధం కావసి వుంటుంది.

భూ రికార్డు, హక్కు, మ్యూటేషన్లలో లోపాలు ఏళ్ల తరబడి జాప్యాలు వున్న మాట నిజమే. అవినీతి ఎక్కువగా వుండే శాఖలో ఒకటిగా రెవెన్యూ పేరు మోసింది. ఈ దశలో బడాబాబుల భూములకు విముక్తి ఎలా? అన్నదానికి సమాధానం దొరకాల్సి ఉంది. ఈ దశలో మరింత లోతైన వివరమైన అధ్యయనం జరగాల్సి వుంటుంది.

# బిజెపి శ్రేణులకు కలసి వచ్చిన సెప్టెంబర్ 17

### యాదృచ్ఛికంగా మోడీ జన్మదినం కావడంతో జోష్

న్యూఢిల్లీ,సెప్టెంబర్17(ఆర్ఎన్ఎ): యాదృచ్ఛికంగానే తెలంగాణ విమోచన దినోత్సవం..ప్రధాని మోడీ పుట్టిన రోజు ఒకటే కావడంతో దేశవ్యాప్తంగా హడావిడి కార్యక్రమాలు జోరందుకున్నారు. తెలంగాణలో విమోచన కోసం బిజెపి శ్రేణులు ఆందోళన తరహా జెండా కార్యక్రమాలను చేపట్టారు. భారత్ మాతా కి జై అంటూ నినదించారు. సెప్టెంబర్ 17న తెలంగాణ తరతరాల బానిస సంకెళ్లను తెంచుకుని స్వాభిమానంతో తలెత్తుకున్న రోజుగా చరిత్రలో నిలిచింది. నాడు దేశహోంమంత్రి సర్దార్ పటేల్ స్వదేశీ సంస్థానాలను ఏకం చేసే పనిలో భాగంగా తెలంగాణకు విముక్తి కల్పించారు. దేశ ప్రధానిగా బాధ్యతలు చేపట్టిన ప్రధాని మోడీ కూడా 70వ దశకంలో పడ్డారు. వరుసగా రెండోసారి అధికారంలోకి రావడం పలు కీలక నిర్ణయాలతో దేశంలో ఆశాకిరణంగా ప్రధాని కనిపిస్తున్నారు.

తనను తాను దేశ ప్రధాన మంత్రిగా కాక, ప్రధాన సేవకుడిగా చెప్పుకుంటూ, ఒక్కరోజూ తన క్షేమం చూసుకోకుండా, రోజుకు 20 గంటల పాటు దేశ సంక్షేమం కోసం కష్టపడే వ్యక్తి మనదేశ ప్రధాని కావడం భారతీయులందరి అదృష్టంగా బిజెపి శ్రేణులు అభివర్ణిస్తున్నాయి. మోడీ హయాంలో ప్రభుత్వ పరంగగా ఎలాంటి అవినీతి లేదన్నది బిజెపి నేతల వాదన. మోడీ చిత్తశుద్దికి ఇది నిదర్శనమని అంటున్నారు. గుజరాత్‌ను ఒక ఆదర్శ అభివద్ధి రాష్ట్రంగా తీర్చిదిద్దారు. 2004లో ఏర్పడిన యూపీఏ ప్రభుత్వం మోదీని అనేక విషమ పరీక్షలకు గురిచేసింది. అనేక విధాలుగా ప్రభుత్వ ఏజెన్సీలను ఉపయోగించి చిరాకు కలిగించింది. 2014లో దేశ ప్రధానిగా బాధ్యతలు స్వీకరించి, మును పెన్నడూ లేనివిధంగా పార్లమెంటునే దేవాలయంగా భావించి, అవినీతిరహిత సుపరిపాలనలో తన ముద్ర వేసిన నిరాడంబర రాజకీయ నేత మోడీ అని బిజెపి మాజీ అధ్యక్షుడు డాక్టర్ల లక్ష్మణ్ వ్యాఖ్యానించారు. 2019లో అఖండమైన మెజార్టీతో రెండవసారి ప్రధాని అయ్యాక ఈ దేశం మునుపెన్నడూ చూడని అద్భుతమైన విజయాలను మోదీ స్వంతం చేసుకొందన్నారు. అయోధ్య, కాశ్మీర్ ఆర్టికల్ 370, 35ఎ రద్దు, ముస్లిం మహిళల కష్టాలను తీర్చే ట్రిపుల్ తలాక్ చట్టం రూపకల్పన, ఇతర దేశాలలో మైనార్టీలయిన హిందువుల కష్టాలు తీర్చే సిఎఎ చట్టం వంటి చట్టాలను ఎంతో సాహసవంతంగా తెచ్చి అన్ని వర్గాల ప్రజల గుండెల్లో విలువైన స్థానం సంపాదించారని అన్నారు. భారత్‌ను.. ఇతర ఇరుగు పొరుగు దేశాలకు చీకాకులు కలిగిస్తున్న చైనా నడ్డి విరవడంలో నేడు మోదీ చూపిస్తున్న తెగువ, సాహసం అనన్యసామాన్యం. అత్యంత ఆయుధ సంపత్తి కలిగిన చైనా పట్ల ఇటువంటి కఠిన వైఖరి అవలంబించడానికి ఇంతకుముందటి మనదేశ ఏ నాయకుడూ కనీసం ఆలోచన చేసే ధైర్యం కూడా చేయలేకపోయారు. కానీ నేడు మోదీ ప్యాంగాంగ్ సరస్సులోని కొండ శిఖరాలను భారత స్వాధీనంలోకి తెచ్చారు, చైనా వస్తువులను వాడొద్దని ప్రజలకు పిలుపునిస్తూ, చైనా యాప్స్‌ను నిషేధిస్తూ, ఆర్థికంగా, సైనికంగా అనూహ్య ఎత్తుగడలతో చైనాను ఉక్కిరిబిక్కిరి చేస్తున్నారని అన్నారు.

# వైరాలజిస్టు డా. లి మెంగ్ యాన్‌కు షాక్

### అమె అకౌంట్‌ను తొలగించిన ట్విట్టర్

బీజింగ్,సెప్టెంబర్17(ఆర్ఎన్ఎ): కరోనా వైరస్ మహమ్మారి చైనా ప్రభుత్వ ఆధ్వర్యంలోని వూహాన్ ల్యాబ్‌లో తయారైందని సంచలన ఆరోపణలు చేసిన హాంకాంగ్‌కు చెందిన ప్రముఖ వైరాలజిస్టు డా. లి మెంగ్ యాన్‌కు ట్విట్టర్ షాక్ ఇచ్చింది. కరోనాపై తన దగ్గర ఆధారాలున్నాయని యాన్ తెలిపారు. ఈ క్రమంలో ట్విట్టర్ ఆమెకు షాక్ ఇచ్చింది. తన అకౌంట్‌ను సస్పెండ్ చేసినట్లు ప్రకటించింది. యాన్ ఖాతాను మంగళవారం తొలగించినట్లు డైలీ మెయిల్‌లోని ఒక నివేదిక తెలిపింది. ఆమె ట్విట్టర్ అకౌంట్ సస్పెండ్ చేయబడింది అనే మెసేజ్ వచ్చింది. నిబంధనలను ఉల్లంఘించే వారి ఖాతాలను ట్విట్టర్ నిలిపివేస్తుంది. అయితే యాన్ అకౌంట్‌ని సస్పెండ్ చేయడంపై ట్విట్టర్ ఇంకా స్పందించలేదు. కరోనా వైరస్‌కు సంబంధించి అవాస్తవ సమాచార వ్యాప్తి చేస్తే చర్యలు తప్పవని మైక్రోబ్లాగింగ్ సైట్ మే నెలలో హెచ్చరికలు జారీ చేసింది. అయితే ప్రస్తుతం యాన్ ఉల్లంఘించిన ట్విట్టర్ నియమాలు ఏంటనే దాని గురించి స్పష్టత లేదు. హాంకాంగ్‌కు చెందిన ప్రముఖ శాస్త్రవేత్తలలో ఒకరైన లి మెంగ్ కరోనా వైరస్ వ్యాప్తికి చైనా ప్రభుత్వమే కారణమని మొదటినుంచి చెబుతూనే ఉన్నారు. కరోనా వైరస్ వ్యాప్తి చెందుతుందన్న సంగతి ప్రభుత్వానికి ముందే తెలుసునని ఆమె అన్నారు. పలు భద్రతా కారణాల దృష్ట్యా ఆమె హాంకాంగ్ నుంచి అమెరికాకు తరలివచ్చేశారు. సెప్టెంబర్ 11న ఓ షోలో ఆమె మాట్లాడుతూ కరోనా వైరస్‌పై చేసిన పరిశోధనలు.. తాను ప్రస్తుతం ఎదుర్కొంటున్న సవాళ్లను పంచుకున్నారు. మరోవైపు వ్యాక్సిన్ తయారీలో చైనా తలమునకలై ఉంది. చైనా తయారు చేస్తోన్న కోవిడ్ వ్యాక్సిన్ నవంబర్ నాటికల్లా ప్రజలకు అందుబాటులోకి రానుందని చైనా సెంటర్ ఫర్ డిసీజ్ కంట్రోల్ అండ్ ప్రివెన్షన్(సీడీసీ) వెల్లడించింది. చైనాలో మానవప్రయోగ తుదిదశలో ఉన్న నాలుగు కోవిడ్ వ్యాక్సిన్‌లలో మూడింటిని ఇప్పటికే అత్యవసర కార్యక్రమం కింద, అత్యవసర సిబ్బందికి ఉపయోగించారు. ఫేజ్–3 క్లినికల్ ట్రయల్స్ ప్రక్రియ సజావుగా సాగుతోందనీ, ఈ వ్యాక్సిన్ నవంబర్, లేదా డిసెంబర్‌లో ప్రజలకు అందుబాటులోకి వస్తుందని సీడీసీ చీఫ్, బయోసేఫ్టీ ఎక్స్‌పర్ట్ గ్విన్‌జెన్ వూ వెల్లడించారు. ఏప్రిల్‌లో స్వయంగా తానే వ్యాక్సిన్ తీసుకున్న తరువాత, తనకు ఎటువంటి అసాధారణ లక్షణాలు కనిపించలేదని గ్విన్‌జెన్ వూ తెలిపారు. అయితే ఆమె ఏ వ్యాక్సిన్ తీసుకున్నారనే విషయాన్ని వెల్లడించలేదు. చైనా ఔషధ దిగ్గజ సంస్థ నేషనల్ ఫార్మాస్యూటికల్ (గ్రూప్(సినోఫార్మ్), సినోవా బయోటెక్ అత్యవసర కార్యక్రమం కింద మూడు వ్యాక్సిన్‌లను అభివృద్ధి చేస్తున్నాయి. కాన్‌సినో బయోలాజిక్స్ డెవలప్ చేసిన నాల్గో వ్యాక్సిన్‌ని చైనా సైన్యానికి ఉపయోగించేందుకు జూన్‌లో అనుమతి లభించింది. మూడవ దశ ట్రయల్స్ ముగిసిన తర్వాత ఈ ఏడాది చివరి నాటికి ఈ వ్యాక్సిన్ ప్రజలకు అందుబాటులో వస్తుందని సినోఫార్మ్ జూలైలో వెల్లడించింది.

## కరోనా బారిన పడ్డ కేంద్రమంత్రి గడ్కరీ

న్యూఢిల్లీ,సెప్టెంబర్17(ఆర్ఎన్ఎ): కేంద్ర మంత్రులంతా వరుసగా కరోనా బారిన పడుతున్నారు. తాజాగా మరో కేంద్రమంత్రి నితిన్ గడ్కరీకి కోవిడ్–19 సోకింది. ఈ విషయాన్ని బుధవారం సాయంత్రం ట్విట్టర్ ద్వారా తెలియజేశారు. ' నిన్న ఒంట్లో నలతగా అనిపించి, డాక్టర్‌ను సంప్రదించాను. పరీక్షలు నిర్వహించగా..కోవిడ్–19 అని తేలింది. ప్రస్తుతం నా ఆరోగ్యం బాగానే ఉంది. స్వీయ నిర్బంధంలో ఉన్నా' అని ట్వీట్ చేశారు. ఇటీవల కాలంలో తనను కలిసిన వారందరూ జాగ్రత్తగా ఉండాలని, ప్రోటోకాల్ అనుసరించాలని, సురక్షితంగా ఉండండి అటూ మరో ట్వీట్ చేశారు. హోం శాఖ మంత్రి అమిత్‌షా, జల శక్తి శాఖ మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్, ఆయుష్ శాఖ మంత్రి సిర్పద్ నాయక్, అగ్రికల్చర్ శాఖ సహాయక మంత్రి కైలాష్ చౌదరి, పార్లమెంటరీ వ్యవహారాల సహాయ మంత్రి అర్జున్ రామ్ మేఘ్వాల్, పెట్రోలియం శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ కరోనా బారిన పడిన జాబితాలో ఉన్నారు.

## బాలికను బ్లాక్‌మెయిల్ చేసి 4లక్షలు వసూలు

### –ముగ్గురు నిందితుల అరెస్ట్

హైదరాబాద్,సెప్టెంబర్17(ఆర్ఎన్ఎ): నగరంలోని జీడిమెట్ల పరిధి అయోధ్యనగర్‌లో బాలికను బ్లాక్ మెయిల్ చేసిన ముగ్గురు వ్యక్తులను పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. బాలికకు ఇన్‌స్టాగ్రామ్‌లో పరిచయమైన ముగ్గురు యువకులు.. ఆమె ఫొటోలు తీసుకుని బెదిరింపులకు పాల్పడ్డారు. ఫొటోలను మార్ఫింగ్ చేస్తామని బాలికను బ్లాక్‌మెయిల్ చేస్తూ విడతల వారీగా రూ.4 లక్షలు వసూలు చేశారు. ఈక్రమంలో ఈనెల 14న ముగ్గురు యువకులు బాలిక ఇంటికి వచ్చారు. దీంతో అమ్మాయి తల్లిదండ్రులు వారిని ప్రశ్నించారు. పదోతరగతి మెటీరియల్ కోసం వచ్చినట్లు ముగ్గురు యువకులు వారికి తెలిపారు. అయితే వారిపై అనుమానం రావడంతో బాలికను నిలదీయగా అసలు విషయం తెలిపింది. కుటుంబసభ్యుల ఫిర్యాదుతో కేసు నమోదు చేసిన పోలీసులు ముగ్గురు నిందితులను అరెస్ట్ చేశారు. నిందితులు ఎలిశా, కిశోర్, రాంవికాస్‌గా గుర్తించారు.

## నెల్లూరు చేరిన దుర్గాప్రసాద్ భౌతిక కాయం

### –పలువురు నేతల ఘన నివాళి

నెల్లూరు,సెప్టెంబర్17(ఆర్ఎన్ఎ): బుధవారం అనారోగ్యంతో చెన్నైలో కన్నుమూసిన తిరుపతి ఎంపీ బల్లి దుర్గాప్రసాద్ భౌతికకాయం నెల్లూరు జిల్లా వెంకటగిరికి చేరుకుంది. ఆయనకు పలువురు నేతలు, పార్టీ కార్యకర్తలు నివాళులు అర్పించారు. బల్లి దుర్గాప్రసాద్ భౌతికకాయానికి తిరుపతి ఎమ్మెల్యే భూమన కరుణాకర్ రెడ్డి నివాళులు అర్పించి.. కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా తనకు బల్లి దుర్గాప్రసాద్‌తో ఉన్న అనుబంధాన్ని ఆయన గుర్తు చేసుకున్నారు. అనారోగ్యంతో మరణించిన ఎంపీ బల్లి దుర్గాప్రసాద్ భౌతికకాయానికి కాకాణి గోవర్ధన్ రెడ్డి, కిలివేటి సంజీవయ్య, నేదురుమల్లి రామ్ కుమార్రెడ్డి, ఢిల్లీ బాబు, వెంకటేశ్వర రావు తదితరులు నివాళులు అర్పించారు. అనంతరం కుటుంబసభ్యులను పరామర్శించారు.వెంకటగిరి పట్టణం కర్ణకమ్మవీధి నుంచి బల్లి దుర్గా ప్రసాద్ అంతిమయాత్ర ప్రారంభం కాగా.. కాంపాలెం ప్రాంతంలోని తోటలో బల్లి దుర్గాప్రసాద్ అంత్యక్రియలు జరగనున్నాయి.

## గ్రీన్ ఇండియా ఛాలెంజ్‌లో పాల్గొన్న లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా

న్యూఢిల్లీ,సెప్టెంబర్17(ఆర్ఎన్ఎ): టీఆర్ఎస్ రాజ్యసభ సభ్యుడు జోగినపల్లి సంతోష్‌కుమార్ శ్రీకారం చుట్టిన గ్రీన్ ఇండియా ఛాలెంజ్ దిగ్విజయంగా కొనసాగుతుంది. దేశ రాజధాని నగరంలో సైతం హరిత యజ్ఞం కొనసాగుతుంది. ఇప్పటికే పలువురు ఎంపీలు ఛాలెంజ్‌ను స్వీకరించి మొక్కలు నాటారు. ఈ క్రమంలో లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా గ్రీన్ ఇండియా ఛాలెంజ్‌లో భాగస్వామ్యమయ్యారు. ఓం బిర్లా పార్లమెంట్ ఆవరణలో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో టీఆర్ఎస్ ఎంపీలు సంతోష్‌కుమార్, కే.కేశవరావు, కొత్త ప్రభాకర్‌రెడ్డి, నామా నాగేశ్వరరావు పాల్గొన్నారు.



గ్రీన్‌ఛాలెంజ్‌లో భాగంగా పార్లమెంట్ ఆవరణలో మొక్కలు నాటిన ఇస్పీకర్ ఓం బిర్లా. చిత్రంలో ఎంపిలు సతోష్ కుమార్, కేశవరావు ఉన్నారు.

# బయ్యారం ఉక్కుపై కేంద్రంపై ఒత్తిడి తేవాలి
## –కేసీఆర్‌ను కోరిన మంత్రి సత్యవతి

హైదరాబాద్,సెప్టెంబర్17(ఆర్ఎన్ఎ): మహబూబాబాద్ జిల్లా బయ్యారంలో ఉక్కు ఫ్యాక్టరీ ఏర్పాటు చేసేందుకు కేంద్రం మీద ఒత్తిడి తీసుకురావాల్సిందిగా సీఎం కేసీఆర్‌ను రాష్ట్ర గిరిజనశాఖ మంత్రి సత్యవతి రాథోడ్ కోరారు. బుధవారం ప్రగతిభవన్‌లో సీఎం కేసీఆర్‌ను కలిసిన మంత్రి సత్యవతి పలు అంశాలపై పరిష్కారాలు కోరుతూ విజ్ఞాపన పత్రాలు అందజేశారు. కేంద్రం సానుకూలంగా లేకపోతే రాష్ట్ర ప్రభుత్వమే ఈ ఫ్యాక్టరీ ఏర్పాటు చేయాలని ఈ మేరకు విజ్ఞప్తి చేశారు. అదేవిధంగా ఇల్లందు, వైరా, ఖమ్మం నియోజకవర్గాల్లో దాదాపు లక్ష ఎకరాలకు నీరందించే విధంగా సీతారామా లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు మెయిన్ కెనాల్ పై అదనపు లిఫ్ట్ మంజూరు చేయాలని కోరారు. ఏటూరు నాగారం, మంగపేట మండలాల్లోని గోదావరి నది పరివాహక గ్రామాల్లో ప్రవాహం వల్ల జరిగే వరదలు, భూమి కోతను నివారించేందుకు ఫ్లడ్ బ్యాంక్స్ పనులు పూర్తి స్థాయిలో చేపట్టే విధంగా ఆదేశాలు ఇవ్వాలన్నారు.

గార్ల–రాంపూర్ రోడ్డు కమ్ బ్రిడ్జి ఆ ప్రాంతాల రవాణాకు అత్యంత ముఖ్యమైన రహదారి. ప్రతిసారి వర్షాకాలంలో ఈ రోడ్డు ముంపునకు గురి కావడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న నేపథ్యంలో మున్నేరు వాగుపై హైలెవల్ బ్రిడ్జి మంజూరు చేయాల్సిందిగా విన్నవించారు. స్థానికుల డిమాండ్ నేపథ్యంలో మహబూబాబాద్ జిల్లాలో ఇనుగుర్తిని నూతన మండలంగా ఏర్పాటు చేయాలని కోరారు. ఇనుగుర్తిలో మండలానికి కావల్సిన ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, బాలికల రెసిడెన్షియల్ పాఠశాల, సోషల్ వెల్ఫేర్ బాయ్స్ హాస్టల్, లైబ్రరీ, బ్యాంకు, వెటర్నరీ హాస్పిటల్ వసతులున్నందున మండలంగా ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఇచ్చిన హామీ మేరకు మహబూబాబాద్ జిల్లాకు వైద్య కళాశాల మంజూరు చేయాల్సిందిగా కోరారు. మహబూబాబాద్ లో మోడర్న్ మార్కెట్ డిమాండ్ కూడా చాలాకాలంగా ఉందని, దీనిని కూడా సానుకూలంగా పరిశీలించి మంజూరు చేయాలని సీఎంను కోరారు.

# హుందాగా సాగిన అసెంబ్లీ సమావేశాలు
## కరోనా ప్రత్యేక కార్యాచరణతో ఆదర్శంగా నిర్వహణ
## మీడియాతో మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి

హైదరాబాద్,సెప్టెంబర్17(ఆర్ఎన్ఎ): కరోనా నేపథ్యంలో అసెంబ్లీ సమావేశాలు నేటితో నివదికంగా వాయిదా పడినట్లు రాష్ట్ర శాసనసభ వ్యవహారాలశాఖ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి తెలిపారు. సభా సమావేశాల నిర్వహణపై మంత్రి మీడియాతో మాట్లాడుతూ.. ఎనిమిది రోజుల పాటు అసెంబ్లీ సమావేశాలు హుందాగా, అర్థవంతంగా సాగాయన్నారు. కరోనా భయంలో కూడా ప్రారంభం నుంచి నేటి వరకు ఎలాంటి చిన్న ఇబ్బంది లేకుండా ఉభయ సభలు జరిగాయన్నారు. కరోనా ప్రత్యేక కార్యాచరణతో ఉభయ సభలు దేశానికే ఆదర్శంగా అన్న రీతిలో సాగాయన్నారు. ఈ సందర్భంగా స్పీకర్, చైర్మన్, సభానాయకులు, విప్పులు, ఎ÷–లోర్‌లీడర్లు, అన్ని పార్టీ ప్రజాప్రతినిధులు, పోలీసు యంత్రాంగం, అసెంబ్లీ సిబ్బందికి ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుతున్నట్లు చెప్పారు. మాజీ ప్రధాని, దివంగత పీవీ నరసింహారావుకు భారతరత్న ఇవ్వాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరుతూ అసెంబ్లీ తీర్మానం ఆమోదించినందుకు సంతోషంగా ఉందన్నారు. రైతులకు గుదిబండగా మారనున్న ప్రతిపాదిత కేంద్ర విద్యుత్ చట్టాన్ని ఉపసంహరించుకోవాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరుతూ ప్రత్యేక తీర్మానాన్ని ఆమోదించుకోవడం జరిగిందన్నారు. చారిత్రాత్మక రెవెన్యూ

చట్టాన్ని ఉభయసభలు ఈ సమావేశాల్లోనే ఆమోదించడం హర్షణీయమన్నారు. పట్టణాల్లో భవన నిర్మాణ అనుమతులను పూర్తి పారదర్శకంగా మార్చేందుకు ఉద్దేశించిన మొత్తం 12 బిల్లులను ఉభయ సభలు ఆమోదించాయన్నారు. టీఎస్ బీపాస్ బిల్లును ఈ సమావేశాల్లోనే ఆమోదించున్నాం. పార్లమెంట్‌లో కొన్ని రాష్ట్రాల చట్టసభల్లో ప్రశ్నోత్తరాల సమయం రద్దు చేసినప్పటికీ సీఎం కేసీఆర్ చొరవతో ఉభయసభల్లో ప్రశ్నోత్తరాల సమయం, జీరో అవర్ పెట్టుకున్నాం. జీరో అవర్‌కు కూడా ఇబ్బంది లేకుండా చేశాం. ప్రజాస్వామిక హక్కుగా వాటిని సీఎం పెట్టాలని ప్రతిపాదించినట్లు తెలిపారు. మాజీ రాష్ట్రపతి ప్రణబ్ ముఖర్జీ, దుబ్బాక ఎమ్మెల్యే రామలింగారెడ్డికి అసెంబ్లీ ఘనంగా నివాళులర్పించిందన్నారు. మొత్తం 11 మంది దివంగత నేతలకు నివాళులర్పించినట్లుగా తెలిపారు. కరోనా సహా ప్రధాన అంశాలపై స్వల్పవ్యవధి చర్చలను ఉభయ సభల్లో చేపట్టినట్లు చెప్పారు. కరోనాతో కొన్ని ఇబ్బందుల కారణంగా ఈసారి సందర్శకులకు అనుమతి కల్పించలేకపోయామన్నారు. మీడియాను గ్యాలరీకే అనుమతించామన్నారు. అందరూ పెద్దమనసుతో సహకరించినందుకు ధన్యవాదాలు అన్నారు. అనేక రాష్ట్రాల్లో కరోనా పరిస్థితుల్లో చట్టసభలను ఐదు రోజులకు మించి జరపలేదని తెలిపారు. దురదృష్టవశాత్తు సమావేశాల సందర్భంగా కొందరికి కరోనా పాజిటివ్‌గా నిర్ధారణ అయింది. సభ్యుల అభిప్రాయాలు పరిగణలోకి తీసుకున్న తర్వాతే సమావేశాను కుదించాలని స్పీకర్, చైర్మన్లు నిర్ణయించారు. తమకు సమయం సరిగా లభించలేదని కొందరు ప్రతిపక్ష సభ్యులు అంటున్నారని తెలిసిందన్న మంత్రి గణాంకాలతో సహా వివరాలను వెల్లడించారు. సభా నాయకుడు, సీఎం కేసీఆర్ 4 గంటల 32 నిమిషాలు మాట్లాడితే కాంగ్రెస్, ఎంఐఎం ఫ్లోర్ లీడర్లు కలిపి 5 గంటల 4 నిమిషాలు మాట్లాడినట్లు తెలిపారు. 103 మంది ఎమ్మెల్యేలు ఉన్న టీఆర్ఎస్‌తో సమానంగా కాంగ్రెస్ ఎంఐఎం సభ్యులు మాట్లాడారన్నారు. పాలకపక్షం ఎంత ఉదారంగా ఉందో ఈ గణాంకాలు వెల్లడిస్తుయని మంత్రి పేర్కొన్నారు.

# అంబేద్కర్ విగ్రహ నమూనా ఆవిష్కరణ

హైదరాబాద్,సెప్టెంబర్17(ఆర్ఎన్ఎ): రాష్ట్రానికే తలమానికంగా నిలిచే 125 అడుగుల అంబేద్కర్ విగ్రహ నమూనా చిత్రపటాన్ని ప్రభుత్వం బుధవారం ఆవిష్కరించారు. అంబేద్కర్ విగ్రహ నమూనా చిత్రపటాన్ని మంత్రి కేటీఆర్ సమక్షంలో రాష్ట్ర సంక్షేమశాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్ విడుదల చేశారు. రాష్ట్ర ప్రభుత్వం రూ. 146.5 కోట్ల వ్యయంతో హైదరాబాద్ నడిబొడ్డున హుస్సేన్‌సాగర్ తీరంలో ఎన్‌టీఆర్ గా÷–డ్గ÷న్ పక్కన 11.8 ఎకరాల విస్తీర్ణంలో అంబేద్కర్ విగ్రహ ప్రాజెక్టును చేపట్టింది.

125 అడుగుల ఎత్తు, 45.5 అడుగుల వెడల్పుతో అంబేద్కర్ విగ్రహం ఏర్పాటు. 7.91 లక్షల కిలోల స్టీల్, 96.19 టన్నులతో అంబేద్కర్ కాంస్య విగ్రహం ఏర్పాటు. ప్రాజెక్టులో మ్యూజియం, గ్రంథాలయం ఏర్పాటు చేయనున్నారు. అలాగే 125 అడుగుల అంబేద్కర్ విగ్రహ ఏర్పాటుకు ప్రభుత్వం జీవో విడుదల చేసింది. అంబేద్కర్ విగ్రహ నమూనాను మంత్రి ఈటల రాజేందర్ ఆవిష్కరించారు. అంబేద్కర్ విగ్రహానికి రూ. 140 కోట్లు ఖర్చు అవుతుందని మంత్రి కొప్పుల ఈశ్వర్ తెలిపారు. హుస్సేన్‌సాగర్ సమీపంలో 11 ఎకరాల స్థలంలో అంబేద్కర్ పార్క్, అంబేద్కర్ విగ్రహంతో పాటు మ్యూజియం, లైబ్రరీ ఏర్పాటు చేస్తామని కొప్పుల ఈశ్వర్ ప్రకటించారు.

# వేములవాడ అర్బన్ మండలశాఖ ఆధ్వర్యంలో ఘనంగా తెలంగాణ విమోచన దినం



వేములవాడ, సెప్టెంబర్ 17 (నేటినిజం ప్రతినిధి): వేములవాడ అర్బన్ మండల శాఖ అధ్యక్షులు ఎర్రం నరసన్న ఆధ్వర్యంలో గురువారం తెలంగాణ విమోచన దినోత్సవం వేడుకలు వేములవాడ నంది కమాను వద్ద ఘనంగా నిర్వహించారు . ముందుగుజాతీయ జెండాను బిజెపి అర్బన్ అధ్యక్షుడు ఎర్రం నరసన్న ఎగరవేశారు . నిజాం వ్యతిరేక పోరాటంలో అసమాన త్యాగాలు చేసిన నాటి సమరయోధులను స్మరించుకున్నారు . ఈ కార్యక్రమంలో సంక పెల్లి ఎంపీటీసీ బుర్ర లహరి శేఖర్, రుద్రవరం ఎంపీటీసీ గాలి పెల్లి సువర్ణ స్వామి గౌడ్, సింగిల్విండో డైరెక్టర్లు రత్నాకర్ రావు ,కట్ట శ్రీనివాస్ గౌడ్, గోనె భాస్కర్, ఏబీవీపీ జిల్లా అధ్యక్షులు జింక అనిల్ ,మండల ప్రధాన కార్యదర్శి ప్రశాంత్ ,రాజన్న సిరిసిల్ల జిల్లా యూత్ నాయకులు కాసర్ల అరుణ్ కుమార్, వెంకటేశ్వర రావు ,మోహన్ రావు ,నాగుల సురేష్ గౌడ్ ,పూర్ణచంద్, మారావేణి మహేష్ ,రెడ్డవే నీ రాజు, జింక శీను, ఎర్రం నాగరాజ్ , ఏరు గోకుల రమేష్ , బక్కయ్య, చీర్లవంచ అంజన్న, కనకరాజు, కోడి ముంజ చిన్న, బిజెపి కార్యకర్తలు నాయకులు పాల్గొన్నారు

# జగన్ అలా....కెసిఆర్ ఇలా!

హైదరాబాద్,సెప్టెంబర్17(ఆర్ఎన్ఎ): కేంద్రం ప్రతిపాదించిన విద్యుత్ బిల్లు యుద్ధమేఘంలా తరుముకుని వస్తోంది. ఇది అమల్లోకి వస్తే విద్యుత్ మన చేతుల్లో ఉండదు. ఇకనుంచి విద్యుత్ నియంత్రణ అంతా కేంద్రం చేతుల్లోకి వెళ్లనుంది. కరెంట్ కట్ అయినా కేంద్రం నుంచి వచ్చే ఆదేశాల కోసం ఎదురు చూడాల్సిందే. సమాఖ్య వ్యవస్థను అభాసుపాలు చేసేలా రాష్ట్రాల మీద పెత్తనం చేసే క్రమంలో కేంద్రం తీసుకుని వస్తున్న విద్యుత్ నియంత్రణ బిల్లు విషయంలో కెసిఆర్ ఎదిరించే ధోరణితో ఉంటే.. జగన్ మాత్రం కేంద్ర శాసనాన్ని అమలు చేసే వ్యక్తిగా ముందుకు పోతున్నారు. అయితే ఇక్కడ ఇద్దరు సిఎంల పరిస్థితి వేరు. కేంద్రం ప్రతిపాదించిన విద్యుత్ బిల్లును ఆమోదిస్తే ఎపిలో జగన్‌కు పెద్దగా ఒరిగే నష్టం లేదు. ఎందుకంటే అక్కడ నిరంతర వ్యవసాయ విద్యుత్ ఉచితంగా అందడం లేదు. అది నాలుగైదు గంటలు మాత్రం ఉచితంగా ఇస్తున్నారు. అందులోనూ లెక్కలేని అనధికార కనెక్షన్లు ఉన్నాయి. వాటి నష్టాలను తొలగించుకోవాలని కూడా చూస్తున్నారు. అలాగే గృహ,పారిశ్రామిక, వాణిజ్య అవసరాలకు కూడా నిరంతర విద్యుత్ అందడం లేదు. దీంతో పోయేదేమీ లేదు. అయితే తెలంగాణ పరిస్థితి వేరు. దీని పర్యవసానాలు తీవ్రంగా ఉంటాయని తెలంగాణ సిఎం కెసిఆర్ ముందే పసిగట్టారు. అందుకే కేంద్రాన్ని నిలువరించేలా..అవసరమైతే ఢీకొనేలా తన యుద్ధ సన్నాహాలు చేపట్టారు. ఇందులో భాగంగానే విద్యుత్ బిల్లును వ్యతిరేకిస్తూ అసెంబ్లీలో ఏకగ్రీవ తీర్మానం చేయించారు. వ్యవసాయానికి నిరంతర ఉచిత విద్యుత్ ఇస్తున్న ఏకైక రాష్ట్రం తెలంగాణ మాత్రమే. రైతులకు ఎంత మేలుచేస్తే అంతగా దేశానికి,రాష్ట్రానికి మంచిదని నమ్మిన ఏకైక వ్యక్తి కూడా సిఎం కెసిఆర్ అనడంలో సందేహం లేదు. అలాగే ప్రజలకు నిత్యావసరాల వస్తువుగా విద్యుత్‌ను గుర్తించి నిరంతరాయంగా విద్యుత్ సరఫరాను తెలంగాణలో అమల్లోకి తెచ్చిన వ్యక్తి కూడా సిఎం కెసిఆర్ మాత్రమే. ఈ రెండు పథకాలు దేశంలో ఎక్కడా ఈ విధంగా అమలు కావడం లేదు. ఇది నూటికి నూరుపాళు కళ్లకు కనిపిస్తున్న దృశ్యం. విద్యుత్ నియంత్రణ బిల్లుతో రాష్ట్రాల చేతుల్లో ఉన్న విద్యుత్ రంగాన్ని గద్దలా తన్నుకుపోవాలని చూస్తున్న కేంద్రాన్ని కోడిపెట్టలా రక్షించే యత్నాల్లో కెసిఆర్ వ్యూహాత్మక అడుగులు వేస్తున్నారు. ఈ దశలో తెలుగు రాష్ట్రాలను తీసుకుంటే కెసిఆర్‌కన్నా వయసులో,అనుభవంలో చిన్నవాడైన ఎపి సిఎం జగన్ మాత్రం కేంద్రం సూచనల మేరకు అడుగులు వేస్తున్నారు. కెసిఆర్ మాత్రం పోరాట వ్యూహంలో ఉన్నారు. దీనిని అడ్డుకునేందుకు ఇతర రాష్ట్రాల ముఖ్యమంత్రులతో కలసి కేంద్రాన్ని ఎదిరించేందుకు సిద్ధమవుతున్నారు. అందుకే తొలి అడుగుగా విద్యుత్ నియంత్రణ బిల్లును వ్యతిరేకిస్తూ అసెంబ్లీలో ఏకగ్రీవ తీర్మానం చేశారు. అయితే కరోనా కష్టాల్లో ప్రజలు ఉండగా ఆదుకోవాల్సిన కేంద్రప్రభుత్వం ఇదే అదనుగా భావించి, సంస్కర ణల పేరుతో వినాశకర విధానాల వేగం పెంచిందనడానికి విద్యుత్ నియంతకణ బిల్లును ఉదాహరణగా చూడాలి. రాష్ట్రాలు అప్పులు తెచ్చుకోవడానికిగాను రుణపరిమితిని పెంచాలంటే ప్రమాదకరమైన షరతులు అమలు చేయాలని ఒత్తిడి చేస్తోంది. అనేక రాష్ట్ర ప్రభుత్వాలు వీటిని వ్యతిరేకిస్తుండగా రాష్ట్రంలో వైకాపా ప్రభుత్వం మాత్రం కేంద్రం ఒత్తిళ్లకు లొంగిపోతోంది. అందులో భాగంగా మోటర్లకు మీటర్లు బిగించి నగదు బదిలీ పథకానికి తెరతీసారు. పంపుసెట్లకు మీటర్లు బిగించే విప్లవాత్మక చర్యలకు ముఖ్యమంత్రి జగన్ పూనుకున్నారని, దేశంలోనే సంస్కరణలు అమలు చేస్తున్న తొలి ముఖ్యమంత్రి అని ప్రభుత్వ సలహాదారు అజయ్‌కల్లాం ప్రకటించారు. దీనినిబట్టి మోడీ ప్రభుత్వం పెట్టిన షరతులను వ్యతిరేకించక పోవడమే కాదు, వాటిని ఆమోదించి వేగంగా అమలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తున్నట్లు తేటతెల్లం అయిపోయింది. జగన్‌కు ఉన్న అనేకానేక చిక్కుల కారణంగా కేంద్రంతో సఖ్యంగా ఉండడం కోసం ఆయన దీనిని ఆమోదించి అడుగులు వేస్తున్నారని అనుకోవాలి. అంతేగాకుండా దీనివల్ల ఎపికి వచ్చే లాభనష్టాలనుబేరీజు వేసుకుని ఉంటారు. గతంలో ప్రపంచ బ్యాంక్ విధానాలకు తలొగ్గిన చంద్రబాబు ఉమ్మడి ఎపిలో విద్యుత్ సంస్కరణల పేరుతో పేదల నడ్డి విరిచారు. అలాగే ఆస్పత్రులు మొదలు అంతటా యూజర్ చార్జీలను అమల్లోకి తెచ్చారు. దీంతో పేదలపై భారం పడింది. ఇకపోతే తాజాగా కేంద్రం ప్రతిపాదించిన ప్రకారం విద్యుత్ ఛార్జీలను నిర్ణయించే కమిషన్‌పై కేంద్ర ప్రభుత్వానిదే పెత్తనం కానుంది. ఇప్పటికే విద్యుత్ చార్జీల నిర్ణయం మా చేతిలో లేదు. రెగ్యులేటరీ కమిషన్ నిర్ణయిస్తుందని పాలకులు చెబుతున్నారు. రేపు కేంద్ర మార్గదర్శక సూత్రాల ప్రకారం రేట్లు తయారు చేసి అమలు చేస్తే, తమ చేతిలో ఏమీ లేదని రాష్ట్ర పాలకులు చేతులు ఎత్తేయగలరు. త అనుభవా లను దృష్టిలో పెట్టుకుంటే ఇదే జరుగనుందని అనుమానిం చడంలో తప్పు లేదు. అలాగే విద్యుత్ చార్జీలు పెరగటమే కాదు మౌలిక విధానాలే మారుతుంటాయి. అందులో తొలి అడుగుగా కేంద్రం ఆడించిన తీరుగా ఎపిలో పంపుసెట్లకు మీటర్లు బిగించడం అన్నది జరుగుతోంది. అందుకే కేంద్ర ప్రభుత్వం తీసుకొస్తున్న కొత్త విద్యుత్ చట్టం అత్యంత ప్రమాదకరమని తెలంగాణ సిఎం కెసిఆర్ ప్రకటించారు. అది ఎలా ప్రమాదకరమో అసెంబ్లీ వేదికగా వివరించారు. ఆ చట్టం సమాఖ్య స్ఫూర్తికి విరుద్ధమని, అనేక రాష్ట్రాలు వ్యతిరేకిస్తున్నాయని చెప్పారు. ఈ చట్టంతో విద్యుత్‌పై రాష్ట్రాలకున్న అధికారం పోతుందని, విద్యుత్ సంస్థలను ప్రైవేటీకరిస్తారని హెచ్చరించారు. కేంద్ర చట్టం వల్ల కలిగే దుష్పరిణామాలను వివరించారు. కేంద్రం తీరును ఎండగట్టారు. ప్రధాని మోదీ చెప్పేది ఒకటి.. చేసేది ఒకటని ఘాటుగానే విమర్శించారు. దేశంలో మిగులు విద్యుత్ ఉన్నా అనేక ప్రాంతాలు ఇంకా చీకట్లోనే ఉన్నాయని ఆందోళన వ్యక్తంచేశారు. ఈ బిల్లుతో రైతులు, పేదలు, విద్యుత్ ఉద్యోగులు.. ఇలా అన్నివర్గాల వారు నష్టపోతారని వివరించారు. ఇప్పుడిప్పుడే కోలుకుంటున్న తెలంగాణ రైతాంగంపై ఇది పిడుగులాంటిదేనని సీఎం ఆవేదన చెందారు. కేంద్రంలోని వరుస ప్రభుత్వాలు దేశంలో వృథా అవుతున్న నీటిని వినియోగించే ప్రణాళికలు రూపొందించలేదని, కానీ రాష్ట్రాల అధికారాలను హరించేందుకు ప్రయత్నించాయని విమర్శించారు. కాంగ్రెస్, బీజేపీలు దేశాన్ని పరిపాలించే విధానంలో అంబేద్కర్ వంటి పెద్దలు సూచించిన ఆదేశిక సూత్రాలను ఉల్లంఘిస్తున్నాయని నిర్మొహమాటంగానే ప్రకటించారు. కేంద్రంలో ఎవరున్నా తమ అధికారాలను కిందికి బదిలీ చేయాల్సిందిపోయి అధికారాలను కేంద్రీకృతం చేశారని తూర్పారా బట్టారు. కాంగ్రెస్, బీజేపీ ఏ ఒక్క రోజు కూడా దేశం మొత్తానికి సంబంధించి నిర్ణయాలు తీసుకోలేదని. అన్నీ తప్పుడు నిర్ణయాలు తీసుకున్నారని మండిపడ్డారు. మొత్తంగా ఈ బిల్లుపై జగన్ భయంతో నిర్ణయం తీసుకుంటే కెసిఆర్ ఎదిరించే ధోరణితో ముందుకు సాగడం విశేషం.

# ప్రజాపంపిణీ వ్యవస్థ బలోపేతం అయ్యేనా?
## నాణ్యత లేని బియ్యంతో ప్రజల్లో విముఖత

న్యూఢిల్లీ,సెప్టెంబర్17(ఆర్ఎన్ఎ): రేషన్ బియ్యం వద్దనుకునే వారికి డబ్బు ఇవ్వడం, నగదు బదిలీ విషయం పరిశీలిస్తున్నామని కేంద్రమంత్రి ప్రకటించారు. కేంద్ర ప్రభుత్వం 'ఒకే దేశం, ఒకే రేషన్' పేరు చెప్పి, వలస కార్మికులపై మొసలి కన్నీరు కారుస్తూ, దేశంలో ఎక్కడైనా రేషన్ తీసుకోవచ్చని నమ్మబలు కుతోంది. పైకి రేషన్ గురించి చెప్పినా ప్రజా పంపిణీని నీరుగార్చేలా, నగదు బదిలీ చేసి చేతులు దులుపుకోవాలని కేంద్రం ఎప్పటి నుంచో ప్రయత్నం చేస్తోంది. బియ్యం నాణ్యత లేక కొందరు తినలేక అవస్థలు పడుతున్నారు. అటువంటి వారికి బియ్యం బదులు డబ్బులు ఇస్తామని ఎరచూపి మోసగించే ప్రయత్నాలు ప్రారంభించారు. బియ్యం బదులు కిలోకు పది, ఇరవై రూపాయలు జమచేసి ప్రభుత్వం ఖర్చు తగ్గించుకోవచ్చు. మార్కెట్లో బియ్యం కొనలేక పేదలకు ఆహార భద్రత లోపిస్తుంది. దశాబ్దాలుగా కొనసాగుతున్న ప్రజా పంపిణీ వ్యవస్థను నాశనం చేస్తే పేదలు దెబ్బతింటారు. బియ్యమే కాక ఏ సరుకులు ఇవ్వరు. కరోనా కష్టకాలంలో కొంతలో కొంతైనా ఆదుకున్న పంపిణీ వ్యవస్థను పూర్తిగా నిర్వీర్యం చేయడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పూనుకుంటున్నాయి. ఇప్పటికే ఉప్పులు,పప్పులు, నూనెలు,కిరోసిన్, చక్కెరలకు కోత పెట్టారు. సులభతర వ్యాపారంపేరుతో చర్యలు చేపడితే రాష్ట్రాలు అప్పులు తీసుకోవటానికి అవకాశం పెరుగుతుందని మరో నిబంధన కేంద్రం పెట్టింది. ఆ దిశలో రాష్ట్ర ప్రభుత్వం చర్యలు ప్రారంభించింది. ఇప్పటికే నిర్వీర్యమైన కార్మికశాఖ ప్రస్తుతం అస్తిత్వం కోల్పోతున్నది. అసంఘటిత కార్మికులు, కనీస వేతనాలు విషయం గత పాలకుల వలె వీరు నోరు మెదపడం లేదు. కార్మిక సంక్షేమ నిధులను మళ్లించేస్తున్నారు. పెట్టుబడిదారులకు భూములు, రాయితీలు ఇవ్వటానికి సిద్ధమవుతున్నారు. సోలార్ విద్యుత్ పేరుతో తెలుగుదేశం పార్టీని మించి బడా కంపెనీలకు రాయితీలు ఇవ్వడానికి జీవోలు జారీ చేశారు. ప్రైవేట్ విద్యుత్ కంపెనీల ఒప్పందాల పునఃసమీక్షపై హడావిడి చేసిన తర్వాత మౌనం వహిస్తున్నారు. అప్పుల కోసం విదేశీ కంపెనీల చుట్టూ తిరుగుతున్నారు. వడ్డీల భారమే కాకుండా విషమ షరతులతో ప్రజల భవిష్యత్తు దెబ్బ తింటుంది. రాజకీయ కక్షలు, వ్యక్తిగత తగాదాలు తప్ప ప్రధాన పార్టీల మధ్య విధాన పరమైన తేడాలు లేవని ప్రజలు గమనించాలి.రాష్ట్ర ప్రభుత్వం రిలయన్స్ జియో తదితర కంపెనీలతో ఒప్పందాలు చేసుకుని, వైఎస్సార్ చేయూత లాంటి సంక్షేమ పథకాలతో ముడిపెట్టి మహిళలకు వ్యాపార శిక్షణ ఇవ్వటానికి పూనుకుంటు న్నారు. ఇప్పటికే ఫేస్‌బుక్‌తో ఒప్పందాలు చేసుకున్న రిలయన్స్ రాష్ట్రంలో రిటైల్ మార్కెట్‌లో ప్రవేశించడానికి ప్రభుత్వమే అధికారికంగా దారులు చూపుతోంది. ప్రత్యేక హోదా, విభజన హామీలు, వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధికి నిధులు, జీఎస్టీ బకాయిల చెల్లింపు, రాష్ట్రాల హక్కుల హరణం వంటి అంశాలపై వైఎస్సార్ ప్రభుత్వం కేంద్రంతో మెతక వైఖరి అవలంబించి రాష్ట్ర ప్రజల ప్రయోజనాలను పణంగా పెడుతోంది. రాజకీయ, వ్యక్తిగత ప్రయోజనాలు మాత్రమే దృష్టిలో పెట్టుకుం టున్నారు. కేంద్ర ప్రభుత్వం చట్టాలు చేస్తే, షరతులు పెడితే అంగీకరిం చక తప్పదు కదా' అనే వాదనలు వినిపిస్తున్నారు. ఎన్ఆర్‌సి కి వ్యతిరేకంగా ప్రజల ఒత్తిడి మేరకు అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్రానికి పంపక తప్పలేదు. అదే తీరులో కేంద్ర ప్రభుత్వ షరతులపై మంత్రివర్గం, అసెంబ్లీ ఎందుకు తీర్మానం చేయకూడదు? ప్రజా ప్రయోజనాల కోసం షరతులు అమలు చేయకుండా నిరసనగళం ఎందుకు విప్పకూడదు కానీ ఆ చిత్తశుద్ధి పాలకులకు లేదు. రాష్ట్రంలో ఏ ప్రభుత్వం ఉన్నా ప్రైవేటీ కరణ, సరళీకరణ విధానాలపై సూత్రబద్ధ వైఖరితో ప్రజలను సమీకరిస్తున్నాయి. ప్రస్తుతం సంక్షేమ పథకాల భ్రమల్లో ప్రజలను ఉంచి, ప్రమాదకరమైన విధానాలను అమలు చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రయత్నిస్తోంది. ప్రజలు అప్రమత్తమై ప్రధాన ముద్దాయి అయిన బిజెపి ప్రభుత్వం పై గళం విప్పాలి. రాష్ట్ర ప్రజలు తిరస్కరించిన బిజెపి విధానాలకు మద్దతు తెలుపుతున్న వైఎస్ఆర్‌సిపి, టిడిపి చర్యలను నిరసించాలి. రాష్ట్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక చర్యలపై ఉద్యమించాలి. ఈ నేపథ్యంలో సిపిఎం, వామపక్షాలు కేంద్ర బిజెపి విధానాలపై నికరంగా పోరాడుతున్నాయి.

# మళ్లీ ఉల్లి ధరల మోత
## వర్షాలకు తోడు పడిపోయిన ఉత్పత్తి
## ఆందోళనలో సామాన్య జనం

హైదరాబాద్,సెప్టెంబర్16(ఆర్ఎన్ఎ): రాష్ట్రంలో ఉల్లి పంటల సాగు తక్కువగా నమోదు కావడంతో ధరలపై తీవ్ర ప్రభావం చూపుతోంది. ఆలంపూర్, గద్వాల, వనపర్తి, కొల్లాపూర్, నారాయణఖేడ్ ప్రాంతాల్లోనే సాగు ఎక్కువ. ఇవి రాష్ట్ర అవసరాలు తీర్చే అవకాశం లేకపోవడంతో మహారాష్ట్ర, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్‌లోని కర్నూలు నుంచి దిగుమతి అయ్యే ఉల్లిపైనే ఎక్కువగా ఆధారపడాల్సి ఉంటోంది. గత ఏడాది వర్షాలకు పంట దెబ్బతినడంతో దేశ వ్యాప్తంగా కిలో ఉల్లి ధర రూ. 160కి చేరింది. తెలంగాణలో గరిష్ఠంగా రూ. 170కి విక్రయాలు జరిగాయి. దీంతో గత ఏడాది సెప్టెంబర్ నుంచి ఫిబ్రవరి వరకు ఉల్లి ఎగుమతులపై ఆంక్షలు విధించడం, యాసంగిలో ఉల్లి సాగు గణనీయంగా పెరగడంతో ధరల నియంత్రణ సాధ్యమైంది. దేశంలో లాక్‌డౌన్ విధించే నాటికి కిలో ఉల్లి ధర రూ. 10–15కి మధ్యకి చేరింది. లాక్‌డౌన్ సమయంలోనూ కూరగాయల ధరలు పెరిగినా ఉల్లి ధర మాత్రం కిలో రూ. 20 దాటలేదు. అయితే కర్ణాటక, మహారాష్ట్ర, ఏపీల్లో.. ఆగస్టు నుంచి కురుస్తున్న వర్షాలతో పంటలు మళ్లీ దెబ్బతిన్నాయి. దిగుబడి గణనీయంగా తగ్గింది. దీంతో నెల రోజుల కింద బహిరంగ మార్కెట్‌లో కిలో రూ. 15నుంచి 20 పలికిన ధర ప్రస్తుతం రూ. 35–40కి చేరింది. ఇదే సమయంలో పొరుగు రాష్ట్రాల నుంచి సరఫరా క్రమంగా తగ్గుతోంది. దీంతో దేశవ్యాప్తంగా మళ్లీ ఉల్లి ధరలు ఘాటెక్కిస్తున్నాయి. నెల రోజులుగా తెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో ఉల్లి సాగు గణనీయంగా చేస్తున్న మహారాష్ట్ర, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్ సహా ఇతర రాష్ట్రాల్లో పంటలు దెబ్బతినడంతో ధరలు అమాంతం పెరుగుతున్నాయి. రాష్ట్రంలోనే నెల రోజుల కిందటితో పోలిస్తే ధర రెట్టింపయ్యింది. కిలో రూ. 40 మేర పలుకుతోంది. పొరుగు నుంచి రావాల్సిన సరఫరా సగానికి తగ్గడమే ధరలు పెరగడానికి కారణమని మార్కెట్ వర్గాలు అంటున్నాయి. దేశ వ్యాప్తంగా ఇదే పరిస్థితి నెలకొనడంతో విదేశాలకు ఉల్లి ఎగుమతులపై కేంద్రం నిషేధం విధించింది. ఉల్లి ధరల నియంత్రణకు అవసరమైతే మరిన్ని చర్యలు తీసుకునేందుకు కూడా కేంద్రం సిద్ధమవుతోంది. మహారాష్ట్ర నుంచి వచ్చిన వేలు రకం ఉల్లి ఏకంగా క్వింటాకు రూ. 3,600 పలికింది. రాష్ట్రీయంగా వస్తున్న ఉల్లి సైతం ఈ నెల ఒకటిన హోల్‌సేల్‌లో క్వింటాకు రూ. 700–800 ఉండగా, అది ఇప్పుడు రూ. 2000కు చేరింది. ఈ ధరలకు అనుగుణంగా బహిరంగ మార్కెట్‌లో ధర కిలో రూ. 20 నుంచి రూ. 40కి చేరింది. ప్రస్తుతం రాష్ట్రానికి సరఫరా తగ్గుతున్న క్రమంలో ధరల్లో పెరుగుదల ఉండవచ్చని మార్కెటింగ్ శాఖ వర్గాలు చెబుతున్నాయి. రాష్ట్రంలోనే కాక దేశ వ్యాప్తంగా ప్రధాన పట్టణాల్లో ఉల్లి ధరలు పెరుగుతున్నాయి. దీంతో కేంద్రం గత ఏడాది మాదిరి ధరలు పెరగకుండా నియంత్రణకు ముందస్తు చర్యలు చేపట్టింది. విదేశాలకు ఉల్లి ఎగమతులపై నిషేధం విధించింది. ఈ మేరకు కేంద్ర వాణిజ్య శాఖ డైరెక్టర్ జనరల్ (డీజీఎఫ్‌టీ) ఉత్తర్వులు జారీ చేసింది. కేంద్రం నిర్ణయంతో బంగ్లాదేశ్, శ్రీలంకలకు ఉల్లి ఎగుమతులు తక్షణమే నిలిచిపోతున్నాయి. ఇక ధరల పెరుగుదలను బట్టి ఉల్లి నిల్వలపైనా ఆంక్షలు విధించే అవకాశం ఉంది. ధరలు భారీగా పెరిగితే వినియోగదారులకు ఉపశమనం కల్పించేందుకు 50 వేల టన్నుల బఫర్ స్టాక్‌ను కేంద్రం దేశ వ్యాప్తంగా అందుబాటులో ఉంచే అవకాశాలను పరిశీలిస్తోందని ఆ వర్గాలు చెబుతున్నాయి.

# టీవీనటి శ్రావణి ఆత్మహత్య కేసులో ట్విస్ట్
## ఎ3గా ఉన్న దేవరాజ్..ఎ1గా పోలీసుల మార్పు
## సాక్షులను విచారించాక మార్చినట్లు వెల్లడి

హైదరాబాద్,సెప్టెంబర్17(ఆర్ఎన్ఎ):టీవీనటి కొండపల్లి శ్రావణి మృతి కేసులో పోలీసులు ట్విస్ట్ ఇచ్చారు. రిమాండ్ రిపోర్టులో ఏ1 గా దేవరాజ్ రెడ్డి, ఏ 2 గా సాయి కృష్ణా రెడ్డి, ఏ 3 గా అశోక్ రెడ్డిని చేర్చారు. అయితే, ఆదివారం మధ్యాహ్నం జరిగిన మీడియా సమావేశంలో ఏ3 గా దేవరాజ్ పేరును వెల్లడించిన పోలీసులు తాజాగా అతన్ని ఏ1 గా పేర్కొన్నారు.

ఇక ఈ కేసులో 17 మంది సాక్షులను విచారించినట్టు పోలీసులు రిమాండ్ రిపోర్టులో తెలిపారు. నిందితులు దేవరాజ్ రెడ్డి, సాయి కృష్ణా రెడ్డిలు విచారణలో కీలక విషయాలు చెప్పినట్టు తెలిసింది.దేవ్‌రాజ్‌ని ప్రేమించిన శ్రావణి ఆ విషయాన్ని కుటుంబ సభ్యులకు చెప్పింది. అదే విషయాన్ని ఆమె కుటుంబ సభ్యులు దేవ్‌రాజ్‌ని అడగడంతో అతను ఒప్పుకోలేదు. శ్రావణి అతన్ని ఒప్పించే ప్రయత్నం చేసింది. కానీ, సాయి కృష్ణా రెడ్డి, అశోక్ రెడ్డిలతో శ్రావణికి రిలేషన్ ఉండటంతో దేవ్‌రాజ్ ఒప్పుకోలేదు. దేవ్‌రాజ్‌ని కలవడానికి శ్రావణి మెసెజ్‌లు, ఫోన్ కాల్స్‌తో ప్రయత్నించింది. సాయి కృష్ణ, అశోక్ రెడ్డి, శ్రావణి కుటుంబ సభ్యులు శ్రావణిని బెదిరించారు.

సెప్టెంబర్ 7న అజీజ్ నగర్ షూటింగ్ లొకేషన్ నుంచి దేవ్‌రాజ్ శ్రావణిని తీసుకెళ్లాడు. ఇద్దరూ కలిసి పంజాగుట్ట శ్రీకన్య హోటల్ కి వెళ్లారు రాత్రి 9.30 గంటలకు చేరుకున్నారు. అదే సమయంలో శ్రీకన్య హోటల్ కు చేరుకున్న సాయికృష్ణ శ్రావణిని కొట్టి ఆటోలో తీసుకెళ్లాడు. దేవ్ రాజ్‌ని కలవకూడదని సాయి కృష్ణా, అశోక్ రెడ్డి శ్రావణిని బెదిరించారు. దేవ్‌రాజ్ ను చంపేసి, ఆర్థికంగా ఆదుకోమని బెదిరింపులకు దిగారు.

దీంతో హైదరాబాద్ వదిలి వెళ్లిపోదామని శ్రావణి దేవ్‌రాజ్ ను కోరింది. శ్రావణి శ్రావణి తో పారిపోయి పెళ్లిచేసుకోవడానికి దేవ్‌రాజ్ ఒప్పుకోలేదు. సాయికృష్ణా, అశోక్ రెడ్డిల వేదింపులు తట్టుకోలేక శ్రావణి ఆత్మహత్యకు పాల్పడింది. ఏ 3 అశోక్ రెడ్డి పరారీలో ఉన్నాడు. సినీరంగంలో అవకాశాలు ఇప్పిస్తానంటూ ఆశచూపి అశోక్ రెడ్డి శ్రావణితో సంబంధం ఏర్పరచుకున్నట్లు పోలీసులు గుర్తించారు. దేవరాజ్‌కు శ్రావణి దగ్గర కావటడం జీర్ణించుకోలేని అశోక్‌రెడ్డి సాయికృష్ణ ద్వారా ఒత్తిడి తెచ్చినట్టు సమాచారం.

# సాగర్‌లోకి భారీగా చేరుతున్న వరద
## 12 గేట్లు ఎత్తి కిందికి నీటిని వదిలిన అధికారులు

నల్గొండ,సెప్టెంబర్17(ఆర్ఎన్ఎ): నాగార్జునసాగర్‌లోకి భారీగా వరద నీరు చేరుతోంది. శ్రీశైలం నుంచి 2,45,651 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది. దీంతో అధికారులు సాగర్ 12గేట్లు ఎత్తివేసి నీటిని దిగువకు విడుదల చేశారు. రెండు నెలల్లో మూడోసారి నీటిని విడుదల చేశారు. నాగార్జునసాగర్‌కు ఇన్‌ఫ్లో 2,45,651 క్యూసెక్కులుగా ఉంది. అవుట్‌ఫ్లో 2,17,984 క్యూసెక్కులుగా ఉంది. పూర్తి స్థాయి నీటి నిల్వ 312.0405 టీఎంసీలుగా ఉంది. ప్రస్తుత నీటి నిల్వ 310.2522 టీఎంసీలుగా ఉంది. ప్రస్తుత నీటి మట్టం 589.40 అడుగులకు చేరుకుంది. కృష్ణమ్మ ఉగ్రరూపం దాల్చి ప్రవహిస్తుండడం, ప్రాజెక్టులన్నీ నిండుకుండల్లా మారడంతో వచ్చిన నీటిని వచ్చినట్లు దిగువకు విడుదల చేస్తున్నారు. నాగార్జునసాగర్ రిజర్వాయర్‌కు శ్రీశైలం నుంచి నీరు వచ్చి చేరుతోంది. అదనపు నీటిని క్రస్టుగేట్లు, జలవిద్యుత్ కేంద్రం, కాల్వల ద్వారా విడుదల చేస్తున్నారు. సాగర్‌కు కొనసాగుతున్న ఇన్‌ఫ్లో ఆధారంగా క్రస్టుగేట్లను పెంచుతూ తగ్గిస్తున్నారు.

మూసీ ప్రాజెక్టుకు ఎగువ ప్రాంతాల నుంచి ఇన్‌ఫ్లో కొనసాగింది. మరోవైపు దుందుభి నదికి వరద పోటెత్తడంతో డిండి జలాశయం అలుగుపోస్తున్నది. మూడు రోజులుగా వరద రాకతో ప్రాజెక్టు పూర్తిగా నిండింది. ప్రాజెక్టు ఎత్తు 36అడుగులు కాగా పూర్తిస్థాయి నీటి సామర్థ్యం 2.45టీఎంసీలు. నీటిమట్టం బుధవారం ఉదయం ఆరు గంటలకు 36.6చేరడంతో అలుగు ప్రవహించింది. దుందుభి నది నుంచి సుమారు పది వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తున్నట్లు అధికారులు తెలిపారు. ఏడేండ్ల తర్వాత ప్రాజెక్టు అలుగు పోస్తుండడంతో ఆయకట్టు రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ప్రాజెక్టు వద్ద పర్యాటకుల సందడి నెలకొంది. ఈ వానకాలం సీజన్‌లో డిండి ప్రాజెక్టు ఆయకట్టులో సుమారు పన్నెండు వేలకు పైగా ఎకరాల్లో వరి సేద్యానికి నీటిని విడుదల చేస్తున్నారు. ఆయకట్టుకు నీటి విడుదల సమయంలో ప్రాజెక్టులో 26అడుగుల మేర నీరు నిల్వ ఉండగా.. క్రమంగా తగ్గి 20అడుగులకు చేరింది. ఆగస్టు 12నుంచి ప్రాజెక్టు పరీవాహక ప్రాంతంలో కురిసిన వర్షాలకు నీటి ప్రవాహం ప్రారంభమై ప్రస్తుతం 33.6అడుగులకు చేరింది.

# బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించడంపై నిషేధాజ్ఞలు కొనసాగింపు
## – కరీంనగర్ పోలీస్ కమీషనర్ విబి కమలాసన్‌రెడ్డి



కరీంనగర్, ఆగష్టు 17 (నేటినిజం ప్రతినిధి)ంసాధారణ పౌరులు, ప్రధానంగా మహిళలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని కరీంనగర్ కమీషనరేట్ పరిధిలో బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించడంపై అమల్లో ఉన్న నిషేదాజ్ఞలను అక్టోబర్ 01 వరకు పొడిగించడం జరిగిందని కరీంనగర్ పోలీస్ కమీషనర్ విబి కమలాసన్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించి మద్యం ప్రియులు పాల్పడుతున్న ఆగడాలపై పలు ఫిర్యాధులు వస్తున్న నేపథ్యంలో ఈ చర్యలు తీసుకోవడం జరిగిందని పేర్కొన్నారు.

మద్యం సేవించి మద్యం ప్రియులు వీధుల్లో, రోడ్లపై అసభ్యపదజాలంతో మాట్లాడుతుడటం అన్ని వర్గాల ప్రజలకు ఇబ్బందిగా పరిణమించింది. మద్యంప్రియుల ఆగడాలకు కళ్లెం వేయడంతోపాటు ప్రజల భద్రత, రక్షణ కోసం ఈ నిర్ణయం తీసుకోవడం జరిగింది. పరిస్థితుల ప్రభావం దృష్ట్యా ఈ కాల పరిమితి పొడిగించబడే అవకాశం ఉంది. ఐపిసి 188, హైదరాబాద్ నగర పోలీసు చట్టం, ఫసలీ నిబంధనలనుసరించి నిషేదాజ్ఞలు ఉల్లఘించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుంది.

డిజెలపై నిషేధాజ్ఞలు పొడగింపు

కరీంనగర్ కమీషనరేట్ పరిధిలో డిజె సౌండ్‌ల వినియోగంపై అమల్లో ఉన్న నిషేధాజ్ఞలను అక్టోబర్ 01వరకు పొడగించడం జరిగిందని పోలీస్ కమీషనర్ విబి కమలాసన్‌రెడ్డి తెలిపారు. ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేశారు. చిన్నపిల్లలు, వృద్ధులు, రోగులు, విద్యార్థుల విద్యాభ్యాసానికి భంగం కలుగకుండా శబ్దకాలుష్యం నుండి కాపాడేందుకు భారీ సౌండ్‌లతో కూడిన డిజె సౌండ్‌ల వినియోగంపై నిషేధాజ్ఞలు విధించడం జరిగిందని పేర్కొన్నారు.

వివిధ కార్యక్రమాల సందర్భంగా ప్రజల సమీకరణ, ప్రదర్శనల కోసం డిజె సౌండ్‌లను వినియోగిస్తున్న విషయం విదితమే. వివిధ కార్యక్రమాల నిర్వాహణకు మైక్‌సెట్ వినియోగం తప్పనిసరి అనిపిస్తే సంబంధిత డివిజన్ ఎసిపిల అనుమతి పొందాలని సూచించారు. ఏ ఏ ప్రాంతాల్లో ఏమేరకు ఏ స్థాయిలో మైక్‌సెట్‌లు వినియోగించాలో పరిమితులున్నాయని పేర్కొన్నారు. కమీషనరేట్ పరిధిలో ఇప్పటి వరకు డిజెల వినియోగంపై యజమానులకు అవగాహన కల్పించడం జరిగిందని, పరిస్థితుల ప్రభావం దృష్ట్యా ఈ కాల పరిమితి పొడిగించబడే అవకాశం ఉంది. నిషేదాజ్ఞలు ఉల్లఘించే వారిపై ఐపిసి 188, హైదరాబాద్ నగర పోలీసుచట్టం, ఫసలి నిబంధనలనుసరించి చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుంది.

# పొంగి పొర్లుతున్న వాగులు, వంకలు..తెలంగాణకు జలకళ

హైదరాబాద్, సెప్టెంబర్ 17 : అల్పపీడన ప్రభావంతో రాష్ట్రంలో వానలు దంచి కొడుతున్నాయి. విస్తారంగా కురున్నవర్షాలకు తెలంగాణ జలకళను సంతరించుకుంది. పలు చోట్ల పంటలు నీటమునిగాయి. మెదక్ జిల్లాలో ఈ రోజు తెల్లవారుజాము నుంచి వన దుర్గా ప్రాజెక్ట్ పొంగిపొర్లుతున్నది. ఏడుపాయల దుర్గా భవాని అమ్మవారి ఆలయం ముందు నుంచి నీరు పరవళ్లు తొక్కుతూ నిజాంసాగర్ వైపు పరుగులు పెడుతున్నది.వికారాబాద్ జిల్లాలో గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు మూసీ, కాగ్నా నదులు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. కోటిపల్లి ప్రాజెక్టు అలుగు పారుతున్నది. భారీ వర్షాలకు ధారూర్ మండలంలోని దోర్నాల్, నాగసముందర్, మంచన్ పల్లి వద్ద తాత్కాలిక వంతెనలు మరోసారి కొట్టుకుపోయాయి. సంగారెడ్డి జిల్లాలో వాగులో పడి ఇద్దరు మృతి చెందారు. రాజన్నసిరిసిల్ల జిల్లా వేములవాడలో భారీగా కురిసిన వర్షం కురిసింది. వేములవాడ పరిధిలోని లక్ష్మీపురం చెరువుకు భారీగా వరద నీరు చేరుతుండటంతో చెరువు కట్ట కోతకు గురైంది. దీంతో రాకపోకలు నిలిచిపోయాయి. అధికారులు మరమ్మతు పనులు చేపడుతున్నారు.



ఏడుపాయల వనదుర్గా ఆలయం వద్ద ఉధృతంగా ఆప్రవహిస్తున్న నది

# సుజల స్వచ్ఛతతోనే ప్రజారోగ్యం

**(18 సెప్టెంబర్ ప్రపంచ నీటి పర్యవేక్షణ దినం సందర్భంగా)**

నీరు సకల జీవులకు ప్రాణాదారం. జలం లేకుండా జన జీవనం సాగదు. విజాతీయ త్రిపరమాణుక నీటి అణువులో ఒక ఆక్సీజన్ పరమాణువుకు రెండు హైడ్రోజన్ పరమాణువులు ఆంగ్ల 'వి' ఆకృతిలో అమర్చబడి ఉంటాయి. సహజంగా ప్రకృతిలో పుష్కలంగా వర్షం, సముద్రం, చెరువులు, నదులు, సరస్సులు, భూగర్భజల రూపంలో లభించే నీటిని ప్రయోగశాలలో తయారు చేయుట ఖర్చుతో కూడిన ప్రక్రియ. సార్వత్రిక ద్రావణిగా శరీరానికి ఆవశ్యక మూలకాలను అందించుటలో నీరు ప్రధాన భూమికను నిర్వహిస్తుంది. నీటి కాలుష్యంతో మనిషికే కాకుండా సమస్త జీవుల ఆరోగ్యాన్ని ప్రభావితం చేస్తుంది. కాలుషిత నీటిని తాగినా, ఇతర ఇంటి అవసరాలకు వాడినా ప్రమాదహేతువు అవుతుంది. ప్రపంచ మానవాళి ఎదుర్కొంటున్న 80 శాతం రోగాలకు ముఖ్యకారణం అపరిశుభ్ర నీటి వల్లనే అని తేలింది. ప్రపంచ మరణాలలో 5 శాతం కలుషిత నీటిని తాగడంతో వచ్చే డయేరియాతో కలుగుతున్నాయి. ప్రపంచ జనాభాలో ఏడాదికి 300 మిలియన్లక మలేరియా సోకుతున్నది. భారత్‌లో 70 మిలియన్లక పైగా డయేరియా కారణ మరణాలు నమోదు అవుతున్నాయి. భూమండల ఉపరితలం 71 శాతం ఉన్న నీటిలో 3.0 శాతం మాత్రమే తాగడానికి ఆమోదయోగ్యంగా ఉంది. మిగిలిన 97 శాతం నీరు సముద్ర లవణజలం మరియు గడ్డకట్టిన రూపంలో ఉంటుంది. విశ్వవ్యాప్తంగా 40 శాతం జనాభాకు స్వచ్ఛ సురక్షిత జలం మరియు పరిసరాల పరిశుభ్రతకు దూరంగా ఉన్నారనే వాస్తవం ఆశ్చర్యాన్ని మరియు విచారాన్ని కలిగిస్తున్నది. ప్రపంచవ్యాప్తంగా తాగు సాగు నీటి కొరతను తట్టుకోవడానికి అందుబాటులో ఉన్న నీటి వనరులను పటిష్టంగా పర్యవేక్షించాలనే భావనను విశ్వవ్యాప్తం చేసే సదుద్దేశంతో 18 సెప్టెంపర్ రోజున "ప్రపంచ నీటి పర్యవేక్షణ దినం" పాటించుట 2003 నుండి (18 అక్టోబర్‌న జరిపే వారు) జరుగుతోంది. నీటివనరులను రక్షించుకుంటూ, స్థానికంగా అందుబాటులో ఉన్న నీటి గుణాలను పరీక్షించే అవగాహనను పిల్లలు, పెద్దలు కలిగి ఉండాలనే విషయాలను ప్రచారం చేయడానికి ఈ దినోత్సవ వేదికలను వినియోగిస్తారు. మనకు స్థానికంగా లభించే నీటి నాణ్యతకు సంబంధించిన ఉష్ణోగ్రత, ఆమ్లత్వం (పిహెచ్), పరిశుద్ధత, కరిగి ఉన్న ఆక్సీజన్ (డిసాల్వుడ్ ఆక్సీజన్), లోహాలు, కరిగి ఉన్న లవణాలు, హైడ్రోకార్బన్లు, పారిశ్రామిక వ్యర్థాలు వంటి జల ధర్మాలను తక్కువ ఖర్చుగల కిట్లతో జరిపే నైపుణ్యం అందరికీ ఉండాలని కోరుకోవాలి. ఎర్త్ ఎక్కో ఇంటర్నేషనల్ సారథ్యంలో నిర్వహించే ప్రపంచ నీటి పర్యవేక్షణ దినాన్ని ప్రపంచదేశాలు పవిత్ర భావంతో నిర్వహించడం సంతోషదాయకం.

అందుబాటులో ఉన్న నీటి వనరులను పరిరక్షించుకోవడం, కలుషితం కాకుండా చూసుకోవడం, రీసైక్లింగ్ చేసుకోవడం మరియు భద్రపరుచుకోవడం వంటి చర్యలను తీసుకొనుటతో నీటి కొరతను అధిగమించవచ్చు. నీటి రవాణాలో లీకేజీలను కట్టడి చేయడం, ట్యాపుల ద్వారా వ్యర్థం కాకుండా చూసుకోవడం, స్నానంలో షవర్ వాడడం, టాయిలెట్లో టిష్యూ పేపర్ వాడడం, సూక్ష్మ సేద్యం చేయడం, స్ప్రింక్లర్లతో తోటలు తడపడం, నీటిని పొదుపుగా వాడడం లాంటి జాగ్రత్తలు నీటి కొరతను తగ్గిస్తాయి. కలుషిత నీటిని తాగడంతో భయంకరమైన కలరా, డయేరియా, మలేరియా, టైఫాయిడ్, డిసెంట్రీ, మలేరియాసిస్, హెపటైటిస్ లాంటి రోగాల బారిన పడుతున్నారు. మన దేశంలోని 91 శాతం పట్టణ ప్రజలకు మరియు 83 శాతం గ్రామీణ జనులకు సురక్షిత తాగునీరు లభిస్తున్నదని ప్రభుత్వ గణాంకాలు తెలుపుతున్నాయి. మన దేశంలో దాదాపు 600 జిల్లాలలో సురక్షిత నీటికి తపిస్తున్నారని నివేదికలు స్పష్టం చేస్తున్నాయి. రూరల్ వాటర్ వర్క్స్ పథకంతో కేంద్రరాష్ట్ర ప్రభుత్వాలు ప్రతి ఇంటికి సురక్షిత నీటిని అందించటానికి గత 70 సంవత్సరాలుగా ప్రయత్నిస్తూనే ఉన్నారు. తెలంగాణ ప్రభుత్వం ఇంటింటికి సురక్షిత తాగు నీరు అందించే బృహత్ భగీరథ పథకం అమలులోకి తెచ్చారు. అధిక జనాభా, నిరక్షరాస్యత, బతుకు తెరువు లేక పోవడం లాంటి సంక్లిష్ట సమస్యల వలయంలో చిక్కిన కుటుంబాలకు కనీసం తాగడానికి గుక్కెడు మంచి నీళ్ళు దొరికేలా ప్రభుత్వాలు తమ కార్యాచరణను అమలు పరచాలి. జలంతోనే జన జీవనం, జనం జీవితాలతోనే జలం విడదీయరాని సంబంధాన్ని పెనవేసుకుంది. దేశపౌరులకు ఉచిత విద్య, వైద్యం మరియు సురక్షిత తాగునీరు ఒక ప్రాథమిక హక్కు. దానిని తీర్చడం మనందరి కనీస కర్తవ్యం.



– డా॥ బుర్ర
మధుసూదన్ రెడ్డి
99497 00037

# కరోనాపై ప్రజల్లో బాధ్యతారాహిత్యం

**అప్రమత్తంగా ఉండడంలో విఫలం**
**అందుకే వైరస్ వ్యాప్తి పెరుగుతోంది**
**రాజ్యసభలో చర్చ సందర్భంగా మంత్రి హర్షవర్ధన్**

న్యూఢిల్లీ, సెప్టెంబర్17(ఆర్ఎన్ఎ): ప్రజల బాధ్యతా రాహిత్యంతోనే కరోనా వైరస్ వ్యాప్తి జరుగుతోందని కేంద్ర కుటుంబ, ఆరోగ్యశాఖ మంత్రి హర్షవర్ధన్ అన్నారు. మాస్కులు ధరించకుండా, సామాజిక దూరం పాటించకుండా సాగడం వల్లనే వ్యాప్తి తీవ్రంగా ఉందన్నారు. కరోనా తగ్గిందన్న భ్రమలో ఉన్న ప్రజలు తగు జాగ్రత్తలు పాటించడం లేదన్నారు. రగురువారం రాజ్యసభలో కరోనాపై చర్చ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశంలో మూడు వ్యాక్సిన్లు అభివృద్ధి చేస్తున్నామని, వచ్చే ఏడాది భారత్‌లో ఒక వ్యాక్సిన్ అందుబాటులోకి వస్తుందన్నారు. దేశంలో అన్‌లాక్ నాటి నుంచి ప్రజలు వైరస్ తగ్గిందని, మాస్కులు ధరించాల్సిన అవసరం లేదని భావించారన్నారు. దీంతో వైరస్ వ్యాప్తి జరుగుతోందన్నారు. వ్యాక్సిన్ అందుబాటులోకి వచ్చే వరకు మాస్క్, భౌతిక దూరమే సామాజిక టీకాలని అన్నారు. కొవిడ్ పరీక్షల్లో త్వరలోనే అమెరికాను దాటనున్నట్లు తెలిపారు. వలస కార్మికులు కొంతకాలంగా సమస్యలను ఎదుర్కొన్నారని, అయితే వారికి సహాయమందించేందుకు కేంద్ర హోంశాఖ, రైల్వేలు గణనీయమైన చర్యలు తీసుకున్నాయని హర్షవర్ధన్ స్పష్టం చేశారు. జనవరి 8 నుంచి ప్రధానమంత్రి, ఆరోగ్యశాఖ మంత్రులు కరోనా మహమ్మారి పరిస్థితిపై సమీక్షిస్తున్నారన్నారు. ముఖ్యమంత్రులంతా ప్రధానితో కలిసి మహమ్మారిపై పోరాటం చేశారన్నారు. జనవరి 30న దేశంలో తొలి కరోనా కేసు నిర్ధారణ అయ్యిందని, అప్పటి కంటే ముందు నుంచే అన్ని రకాల సలహాలు, సూచనలు ఇచ్చినట్లు తెలిపారు. మొదటి పాజిటివ్ కేసును గుర్తించిన సమయంలో 162 కాంటాక్ట్‌లను గుర్తించినట్లు చెప్పారు. మొత్తం పరిస్థితిని పర్యవేక్షించినందుకు ప్రధాని నరేంద్రమోదీని చరిత్ర గుర్తుంచుకుంటుందని చెప్పారు. కాంగ్రెస్ ఎంపీ ఆనంద్ శర్మ ప్రశ్నకు సమాధానమిస్తూ.. ఐదు శాస్త్రీయ సంస్థలు డేటాను ఇచ్చాయని, వాటి ఆధారంగా 14-29లక్షల కేసులను లాక్‌డౌన్ ద్వారా నిరోధించినట్లు చెప్పారు. లాక్‌డౌన్‌లో సుమారు 1,700 ల్యాబ్‌లను ఏర్పాటు చేసినట్లు ప్రకటించారు. మహమ్మారిని ఎదుర్కొనేందుకు అవసరమైన ఎక్విప్‌మెంట్‌ను ఎక్కడ మోహరించాలనే విషయంలో ఏ పార్టీ అధికారంలో ఉన్నదో ప్రధాని చూడలేదని, ఢిల్లీ, మహారాష్ట్ర, పశ్చిమ బెంగాల్, నోయిడాలో కోబాస్ మిషన్లను ఏర్పాటు చేశారని తెలిపారు. ఫిబ్రవరి, మార్చిలో మేం సామర్థ్యాన్ని పెంపొందించుకునే పని చేశామని చెప్పారు. అంతకుముందు విపక్షనేత గులాం నబీ ఆజాద్ మాట్లాడుతూ కరోనా విషయంలో కేంద్రం మరిన్ని చర్యలు తీసుకుని ఉంటే ఇంతదాకా వచ్చేది కాదన్నారు.

న్యూఢిల్లీ కరోనా నియంత్రణలో గోల్డెన్ సమయాన్ని కేంద్ర ప్రభుత్వం వృధా చేసిందఆజాద్ విమర్శించారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ 2019 డిసెంబర్ లోనే కరోనాపై హెచ్చరించిందని గుర్తు చేశారు. చైనా మన పొరుగుదేశం కావడంతో మనం వెంటనే అప్రమత్తమై ఉండాల్సిందని అన్నారు. కరోనా మహమ్మారి మనపై ముంచుకొచ్చే ప్రమాదమున్నదని తమ పార్టీ నేత రాహుల్ గాంధీ అప్రమత్తం చేసినా ప్రభుత్వం పట్టించు కోలేదని గులాం నబీ ఆజాద్ అన్నారు. కరోనా వ్యాప్తి తొలి నెలల్లో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించ డంతోనే ప్రస్తుతం పరిస్థితి తీవ్రత ఎక్కువగా ఉన్నదంటూ ప్రభుత్వంపై మండిపడ్డారు. కాగా, దేశంలో కరోనా వైరస్ విజృంభిస్తూనే ఉన్నది. గత 24 గంటల్లో దేశంలో కొత్తగా 97,894 మందికి కరోనా సోకింది. దీంతో దేశవ్యాప్తంగా వైరస్ కేసుల సంఖ్య 51,18,254కు చేరింది. గత 24 గంటల్లో కరోనా వల్ల 1,132 మంది మరణించారు. దీంతో మొత్తం మరణాల సంఖ్య 83,198కి చేరుకున్నది. కరోనా కేసుల పరంగా ప్రపంచవ్యాప్తంగా అమెరికా తర్వాత భారత్ రెండో స్థానంలో ఉన్నది.

# ఘనంగా తెలంగాణ విమోచన దినోత్సవం

**త్రివర్ణ పతాకం ఎగుర వేసిన రాజన్న సిరిసిల్ల జిల్లా దళిత మోర్చా అధ్యక్షులు కుమ్మరి శంకర్**



వేములవాడ, సెప్టెంబర్ 17 (నేటినిజం ప్రతినిధి):తెలంగాణ విమోచన దినోత్సవాన్ని పురస్కరించుకొని వేములవాడ పట్టణంలోని అంబేద్కర్ నగర్లో రాజన్న సిరిసిల్ల జిల్లా దళిత మోర్చా జిల్లా అధ్యక్షుడు కుమ్మరి శంకర్ తన అనుచరులతో కలిసి త్రివర్ణ పతాకాన్ని ఎగురవేశారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు కేంద్ర ప్రభుత్వం తరపున, బీజేపీ పక్షాన ప్రజలకు స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు.

నిరంకుశ నిజాం పాలన నుంచి విముక్తి పొంది స్వేచ్ఛ వాయువులు పీల్చిన రోజని సెప్టెంబర్ 17 అని పేర్కొన్నారు. ఈ రోజును తెలంగాణా ప్రాంత ప్రజలు మరిచిపోరని వ్యాఖ్యానించారు.

70 ఏళ్ళైనా బానిస మనస్తత్వం ఇంకా పోలేదన్న ఆయన ఇప్పటికీ బానిస మనస్తత్వంతోనే తెలంగాణలో పాలన కొనసాగుతుందన్నారు.

మహారాష్ట్ర, కర్ణాటక లలో విమోచన దినోత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నా, తెలంగాణ ప్రభుత్వం నిర్వహించకపోవడం దురదృష్టకరమని అన్నారు.

ఉద్యమ సమయంలో విమోచన దినోత్సవం జరపాలని డిమాండ్ చేసిన కేసీఆర్, ఇప్పుడు ఎందుకు నిర్వహించట్లేదో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.

**ఘనంగా మోడీ జన్మదిన వేడుకలు**

దేశ ప్రధాని మోడీ జన్మదిన వేడుకలు రాజన్న సిరిసిల్ల జిల్లా బిజెపి దళిత మోర్చా అధ్యక్షులు కుమ్మరి శంకర్ ఘనంగా నిర్వహించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మోడీ జన్మ దినోత్సవం దేశానికి సంతోషకరమైన రోజని,తెలంగాణ ప్రజల తరపున ప్రధాని మోడీకి పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలిపారు.

సమర్ధవంతమైన మోడీ నాయకత్వంలో భారత్ మరింత అభివృద్ధి చెందుతుందని, దేశ ప్రజలకు నీతి నిజాయితీ తో కూడిన పాలన అందిస్తున్నారని కొనియాడారు.

# నిషేధిత గుట్కా ప్యాకెట్ల పట్టివేత



వేములవాడ, సెప్టెంబర్ 17 (నేటినిజం ప్రతినిధి): ప్రభుత్వం నిషేధించినటువంటి గుట్కా ప్యాకెట్లను టాస్క్ ఫోర్స్ సిబ్బంది గురువారం పట్టుకొని, సంబంధిత వ్యక్తులను పోలీసులకు అప్పగించినట్లు టాస్క్ ఫోర్స్ హెడ్ కానిస్టేబుల్ సత్తయ్య తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం టాస్క్ ఫోర్స్ సి ఐ రవి కుమార్ ఉత్తర్వుల మేరకు ఇల్లంతకుంట మండలం గాలి పెల్లి గ్రామంలో చంద్రమౌళి కిరాణా షాప్ లో తనిఖీ చేయగా షాప్ లో రూ 1000 వెయ్యి విలువగల నిషేధిత గుట్కా ప్యాకెట్లతో లభ్యమైనట్లు తెలిపారు .గుట్కా పాకెట్లు లతోపాటు వాటిని అమ్ముతున్న నార చంద్ర మౌళి తగు చర్యలు గురించి ఇల్లంతకుంట పోలీస్ స్టేషన్లో అప్పగించినట్లు తెలిపారు. ఈ దాడిలో కానిస్టేబుల్లు రమేష్, రాజేష్, తిరుపతి పాల్గొన్నారు.

# కానిస్టేబుల్ బర్త్‌డే వేడుకలు -ఇద్దరికి కరోనా

హైదరాబాద్,సెప్టెంబర్17(ఆర్ఎన్ఎ): ఒకవైపు రాష్ట్రంలో కరోనా విజృంభిస్తోంది. ఇలాంటి సమయంలో వేడుకలకు దూరంగా ఉండాలని అధికార యంత్రాంగమంతా చెబుతోంది. ఇలాంటి సమయంలో ప్రజలను అప్రమత్తం చేయాల్సిన పోలీస్ శాఖలోని కొందరు వ్యక్తులు నిబంధనలను అతిక్రమిస్తున్నారు. ఇలాంటి వారి కారణంగా మొత్తం వ్యవస్థకే చెడ్డ పేరు వస్తోంది. రాచకొండ కమిషనరేట్ పరిధిలోని కీసరలో ఓ కానిస్టేబుల్ జన్మదిన వేడుకలు జరిగాయి. ఈ వేడుకలకు హాజరైన ఇద్దరికి కరోనా పాజిటివ్‌గా నిర్ధారణ అయింది. కోవిడ్ నిబంధనలు ఉల్లంఘించి జన్మదిన వేడుకలు జరుపుకున్న శివకుమార్ అనే కానిస్టేబుల్‌ను సీపీ షనూర్ బాబు సస్పెండ్ చేశారు. నవీన్ అనే కానిస్టేబుల్‌కు ఛార్జ్ మెమో ఇచ్చారు. ఇన్‌స్పెక్టర్‌కు సీపీ షో కాజ్ నోటీస్ జారీ చేశారు.

# కరోనా వ్యాక్సిన్ కోసం ఆతృతగా ఎదురుచూపు

**రాజ్యసభలో ఎంపి కెఇఆర్ సురేశ్ రెడ్డి**

న్యూఢిల్లీ,సెప్టెంబర్17(ఆర్ఎన్ఎ): కరోనా వ్యాక్సిన్ కోసం అందరం ఆతృతగా ఎదురుచూస్తున్నామని టీఆర్ఎస్ ఎంపీ సురేశ్ రెడ్డి తెలిపారు. ఆయన రాజ్యసభలో మాట్లాడుతూ.. తాను యువకుడిగా ఉన్న సమయంలో దేశం మొత్తం జయాబచ్చన్ సినిమా రిలీజ్ కోసం వేచి ఉండేదని, ఈ రోజుల్లో యావత్ దేశం మొత్తం వ్యాక్సిన్ రిలీజ్ కోసం ఎదురుచూస్తున్నట్లు ఆయన చమత్కరించారు. ప్రస్తుత దశలో కరోనా వ్యాక్సిన్ అత్యవసరం అన్నారు. వ్యాక్సిన్ అభివృద్ధి చేస్తున్న భారతీయ కంపెనీలకు ఎటువంటి సహాయం చేస్తున్నారన్న విషయాన్ని కేంద్రం తెలియజేయాలని ఆయన కోరారు. పరిశోధనలను వేగవంతం చేసేందుకు ఎటువంటి చర్యలు తీసుకున్నారని ఆయన ప్రశ్నించారు. వ్యాక్సిన్ తయారీ కోసం కావాల్సిన అడ్మినిస్ట్రేటివ్ క్లియరెన్సులు ఏమైనా ఉన్నాయా, ఉంటే ఎలా ఇస్తున్నారని ఆయన అడిగారు. టీకా అభివృద్ధి చేస్తున్న కంపెనీలకు ఎటువంటి నిధులను సమకూర్చుతున్నారని సురేశ్ రెడ్డి ప్రభుత్వాన్ని అడిగారు. కరోనా వైరస్ విషయంలో ఇస్తున్న మార్గదర్శకాల్లో చాలా గందరగోళం ఉన్నదని, ప్రపంచ ఆరోగ్య సంస్థ ఇచ్చిన మార్గదర్శకాలను కేంద్రం, రాష్ట్రాలు పాటిస్తున్నాయని, అయితే డబ్ల్యూహెచ్‌వోతో కేంద్రానికి ఉన్న అనుబంధం ఎటువంటిదని, ప్రపంచ ఆరోగ్య సంస్థకు కేంద్రం ఎటువంటి రేటింగ్ ఇస్తున్నదో వెల్లడించాలని ఎంపీ సురేశ్ రెడ్డి కోరారు. కోవిడ్ యోధుల విషయంలో కేంద్ర ప్రభుత్వం ఫ్రంట్‌లైన్ వర్కర్లకు ఎటువంటి సహాయం చేస్తున్నదో చెప్పలేదన్నారు. కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు వారి జీతాల్లో ఏమైనా బోనస్‌లు ఇచ్చారా అని ఆయన అడిగారు. తెలంగాణ రాష్ట్రంలో ప్రభుత్వ ఉద్యోగులను ఆదుకున్నామని, ఫ్రంట్‌లైన్ వర్కర్లకు పది శాతం జీతం అదనంగా ఇచ్చామని, సుమారు 75వేల ఉద్యోగులకు ఆ ప్రయోజనం చేకూరిందని సురేశ్ రెడ్డి చెప్పారు.

# తెలంగాణలో పెరుగుతున్న కరోనా కేసుల సంఖ్య

**కొత్తగా 2,159 కరోనా కేసులు నమోదైనట్లు వెల్లడి**

హైదరాబాద్,సెప్టెంబర్17 (ఆర్ఎన్ఎ): తెలంగాణలో కరోనా కేసుల సంఖ్య రోజురోజుకు మరింత పెరుగుతుంది. గడిచిన 24 గంటల్లో రాష్ట్రంలో కొత్తగా 2,159 కరోనా కేసులు నమోదైనట్లు రాష్ట్ర వైద్యారోగ్యశాఖ గురువారం ఉదయం హెల్త్ బులెటిన్ విడుదల చేసింది. దీంతో రాష్ట్రంలో మొత్తం కరోనా కేసుల సంఖ్య 1,65, 003గా ఉంది. ఇందులో 1,33, 555 మంది కరోనా నుంచి పూర్తిగా కోలుకొని డిశ్చార్జ్ అయ్యారు. ప్రస్తుతం తెలంగాణలో 30,443 యాక్టివ్ కేసులు ఉన్నాయి. కాగా కరోనాతో 24 గంటల్లో కొత్తగా 9 మంది మృతి చెందగా.. మొత్తం మరణాల సంఖ్య 1005కి చేరింది. కేసుల వారిగా చూస్తే.. జీహెచ్ఎంసిలో 318, కరీంనగర్ లో 127, మేడ్చల్ లో 121, నల్గొండలో 141, రంగారెడ్డి 176, సిద్దిపేటలో 132 కేసులు నమోదయ్యాయి. తెలంగాణలో కరోనా రికవరీ రేటు 80.94 శాతంగా ఉంది. తెలంగాణ ఆరోగ్యశాఖ తాజాగా హెల్త్ బులెటిన్ ను రిలీజ్ చేసింది. ఈ బులెటిన్ ప్రకారం, గడిచిన 24 గంటల్లో తెలంగాణ లో కొత్తగా 2,159 కేసులు నమోదయ్యాయి. దీంతో తెలంగాణలో నమోదైన మొత్తం కరోనా కేసుల సంఖ్య 1,65,003 కేసులు అయ్యాయి. గడిచిన 24 గంటల్లో తెలం గాణలో 9 మంది కరోనాతో మృతి చెందారు.

**అసెంబ్లీలో కెటిఆర్ హామీ మేరకు**

# ఎల్ఆర్ఎస్ సవరణ ఉత్తర్వులు జారీ

హైదరాబాద్,సెప్టెంబర్17(ఆర్ఎన్ఎ): అసెంబ్లీలో మున్సిపల్ శాఖ మంత్రి కెటిఆర్ ఇచ్చిన హామీ మేరకు ఎల్ఆర్ఎస్ సవరణ ఉత్తర్వును ప్రభుత్వం గురువారం జారీ చేసింది. క్రమబద్దీకరణ ఛార్జీలకు తాజా మార్కెట్ విలువను కాకుండా రిజిస్ట్రేషన్ సమయంలో ఉన్న మార్కెట్ విలువ ఆధారంగానే ఎల్ఆర్ఎస్ రుసుంను వసూలు చేయనున్నారు. 2015 నాటి ఎల్ఆర్ఎస్ స్లాబ్‌లతో క్రమబద్దీకరణ రుసుంను వసూలు చేయనున్నారు. చదరపు గజం మార్కెట్ ధర 3 వేల వరకు ఉంటే 20 శాతం, రూ.3, 001 నుంచి రూ. 5 వేల వరకు 30 శాతం, రూ. 5001 నుంచి రూ. 10 వేల వరకు 40 శాతం, రూ. 10,001 నుంచి రూ. 20 వేల వరకు 50 శాతం, రూ. 20,001 నుంచి రూ. 30 వేల వరకు 60 శాతం, రూ. 30,001 నుంచి రూ. 50 వేల వరకు 80 శాతం, రూ. 50 వేలకు పైగా మార్కెట్ ధర ఉంటే వందశాతం క్రమబద్దీకరణ రుసుం వసూలు చేయనున్నారు. నాలా రుసుం కూడా క్రమబద్దీకరణ రుసుంలోనే ఉంటుందని ప్రభుత్వం పేర్కొంది.

ఎల్ఆర్ఎస్‌పై హైకోర్టు నోటీసులు

అక్రమ లే అవుట్ల క్రమబద్దీకరణపై రాష్ట్ర ప్రభుత్వానికి హైకోర్టు నోటీసులు జారీ చేసింది. ఎల్ఆర్ఎస్ విషయంపై ఫోరం ఫర్ గుడ్ గవర్నెన్స్ దాఖలు చేసిన పిల్‌పై హైకోర్టులో విచారణ జరిగింది. ఎల్ఆర్ఎస్ పలు చట్టాలకు విరుద్ధంగా ఉందని సీనియర్ న్యాయవాది సత్యంరెడ్డి వాదించారు. తుది తీర్పునకు లోబడి ఉండేలా మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వాలని న్యాయస్థానాన్ని పిటిషనర్ కోరారు. ప్రభుత్వ వైఖరి తెలుసుకోకుండా ఉత్తర్వులు ఇవ్వలేమని హైకోర్టు స్పష్టం చేసింది. కౌంటర్ దాఖలుకు రెండు వారాల గడువు ఇవ్వాలని ఏజీ బీఎస్ ప్రసాద్ కోరగా కోర్టు అంగీకరించింది. తదుపరి విచారణను అక్టోబర్ 8కి వాయిదా వేసింది.

## క్వారీ గుంతలో పడి ఇద్దరు గల్లంతు

రంగారెడ్డి,సెప్టెంబర్17(ఆర్ఎన్ఎ): శంషాబాద్ మండలంలో విషాదం చోటుచేసుకుంది. కొత్వాల్ గూడలోని క్రషర్ క్వారీ దగ్గర నీటి గుంటలో పడి ఇద్దరు యువకులు గల్లంతయ్యారు. రాజేంద్రనగర్ శివరాంపల్లికి చెందిన మల్లేష్ (24), జయకృష్ణ (25) అనే ఇద్దరు యువకులు క్వారీలో పనికోసం వచ్చారు. అయితే నీటి గుంట దగ్గర సీనరీ బాగుందని ఫొటోలు తీసుకున్నారు. ఆ తర్వాత నీటి గుంటలో కాళ్లు కడుక్కుంటుండగా.. కాలు జారీ ఇద్దరూ నీటి గుంటలో పడి గల్లంతయ్యారు. క్వారీలో పనిచేస్తున్న మిగిలిన కార్మికుల ఫిర్యాదు మేరకు ఆర్జీఐఏ పోలీసులు కేసు నమోదు చేశారు.

# ఖేడ్ తాలుకలో కలెక్టర్ సుడిగాలి పర్యటన..!



సంగారెడ్డి, సెప్టెంబర్ 17 (నేటినిజం ప్రతినిధి) రైతు వేదికల నిర్మాణాలలో నాణ్యత ప్రమాణాలను పాటించాలని జిల్లా కలెక్టర్ హనుమంతరావు ఆదేశించారు.

బుధవారం నారాయణఖేడ్ మండలం ర్యాకల్, సిర్గాపూర్ మండలం ముబారక్ పూర్, కంగ్టి మండలం గాజుల పాడ్, జంబ్గీ- బి, తడ్కల్ గ్రామాలలో పర్యటించి రైతు వేదికల పురోగతిని పరిశీలించారు. పనులలో నాణ్యతా ప్రమాణాలను పాటించకపోవడం , పనులలో జాప్యం సహించబోమని కలెక్టర్ స్పష్టం చేశారు. నిర్లక్ష్యంగా , పనులలో జాప్యం చేస్తున్న కాంట్రాక్టర్లపై ఆగ్రహం వ్యక్తం చేశారు.

కంగ్టి మండలం జంభిగి- బి గ్రామంలో నిర్మిస్తున్న రైతు వేదిక నాసిరకంగా నిర్మించడం పై కాంట్రాక్టర్, సంబంధిత అధికారుల పై కలెక్టర్ ఆగ్రహం వ్యక్తంచేశారు. అట్టి నాసిరకం నిర్మాణాలను కూల్చివేశారు. నాసిరకం పనులను చూసి చూడనట్టు వెళ్ళారనిసంబంధిత అధికారులపై ఆగ్రహం వ్యక్తంచేశారు. పంచాయతీ రాజ్ ఏఈ మాధవ్‌కు షోకాస్ నోటీస్‌లు జారీచేశారు. కాంట్రాక్టర్లు నాసిరక నిర్మాణలు చేస్తే క్రిమినల్ కేసు లు నమోదు చేస్తామని కలెక్టర్ హెచ్చరించారు. రైతు వేదిక పనులను త్వరితగతిన వేగవంతంగా నాణ్యత తో పూర్తిచేయాలని కలెక్టర్ ఆదేశించారు. కలెక్టర్ వెంట ఆర్ డి ఓ అంబదాస్, వ్యవసాయ శాఖ జె.డి నరసింహారావు, పంచాయతీ రాజ్ ఈ ఈ, ఏ ఈ, సర్పంచులు పంచాయితీ సెక్రటరీ లు, తదితరులు పాల్గొన్నారు.

## బతుకమ్మ వేడుకలు ...

# కోవిడ్ నిబంధనలను అనుసరించి జరుపుకుందాం....

**– మున్సిపల్ అధ్యక్షురాలు మాధవిరాజు**



వేములవాడ, సెప్టెంబర్ 17 (నేటినిజం ప్రతినిధి):వేములవాడ పట్టణంలో గురువారం జరుగనున్న ఎంగిలి పూల బతుకమ్మ సంబరాలను కోవిడ్ నిబంధనలను అనుసరించి జరుపుకుందామని మున్సిపల్ అధ్యక్షురాలు రామతీర్థపు మాధవిరాజు పేర్కొన్నారు. బుధవారం మూలవాగు వద్ద ఉన్న బతుకమ్మ తెప్ప వద్ద ఏర్పాట్లను పరిశీలించిన ఆమె మాట్లాడారు. అధిక మాసం సందర్భంగా గురువారం ఒక్క రోజు పండుగ జరుపుకుని, మళ్ళీ అక్టోబర్ నెలలో 17 వ తేదీ నుండి బతుకమ్మ ఉత్సవాలు జరుపుకోనున్నందున ఏర్పాట్లు చేస్తున్నామని ఆమె తెలిపారు. ఆమె వెంట కమిషనర్ శ్రీనివాస్ రెడ్డి, వైస్ చైర్మన్ మధు రాజేందర్, ఏ ఈ నరసింహ స్వామి , సెస్ డైరెక్టర్ రామతీర్థపు రాజు , కౌన్సిలర్లు నిమ్మ శెట్టి విజయ్, శేఖర్, అన్నారం శ్రీనివాస్, శ్రీనివాసరావు , గోలి మహేష్, సంతోష్ బాబు, నాయకులు కనకయ్య, వంగల శ్రీనివాస్, సలీం, గూడూరు మధు, సంగె స్వామి తదితరులు ఉన్నారు

# రైతు వేదికలను సందర్శించిన జిల్లా కలెక్టర్ హనుమంతరావు



సంగారెడ్డి సెప్టెంబర్17 (నేటినిజం ప్రతినిధి) రైతు వేదికల నిర్మాణాలు త్వరితగతిన పూర్తిచేయాలని జిల్లా కలెక్టర్ హనుమంతరావు సంబంధిత అధికారులు, కాంట్రాక్టర్లకు సూచించారు.

మంగళవారం కలెక్టర్ జిల్లాలోని పలు మండలాల్లో సుడిగాలి పర్యటన చేసి రైతు వేదికల నిర్మాణ పనుల పురోగతిని తనిఖీ చేశారు.మునిపల్లి మండలం పెద్ద చెల్మెడ, లోని కలాన్, ఝరాసంగం మండలంలో ఏడాకులపల్లి , జీర్లపల్లి, రాయికోడ్ మండలం సింగీతం , ఔరంగ నగర్, మందాపూర్,పీపడ్ పల్లి,షాపూర్, ఇ టి కే పల్లి, హుల్ గేరా, న్యాల్కల్ మండలం ముంగి, హుస్సేల్లీ నగర్ గ్రామాలలో పర్యటించి రైతు వేదిక పనుల పురోగతిని పరిశీలించారు. పనులను వేగవంతం చేయాలని సంబంధిత కాంట్రాక్టర్ లకు ఆదేశించారు. పనులు నాణ్యతగా ఉండాలని స్పష్టం చేశారు. నత్తనడకన పనులు కొనసాగిస్తున్న కాంట్రాక్టర్ల పై ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారులు రైతు వేదిక పనులను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ త్వరితగతిన నిర్ణీత గడువులోగా పూర్తయ్యేలా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని కలెక్టర్ సూచించారు.

**ఝరాసంగం మండలం జీర్లపల్లీ**

గ్రా మంలో పారిశుద్ధ్య నిర్వహణ సరిగ్గా లేకపోవడంపై పంచాయతీ సెక్రెటరీ మీద కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. పంచాయతీ సెక్రెటరీ కి షోకాజ్ నోటీసు జారీ చేసారు. వారంలోగా పారిశుద్ధ్య నిర్వహణ పనులు సక్రమంగా జరగాలని లేనట్లయితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. రాయికోడ్ మండలం మందాపూర్ గ్రామాల్లో పల్లె ప్రకృతి వనంను కలెక్టర్ పరిశీలించారు. పార్కులో మొక్కలు నాటారు. గ్రామం అన్ని విధాల అభివృద్ధి చెందుతూ ఆదర్శ గ్రామంగా ఉందని సర్పంచ్ ను అభినందించారు. అందరి భాగస్వామ్యంతో గ్రామం మరింత అభివృద్ధి చెందేలా పనిచేయాలని సర్పంచ్ కు సూచించారు. కలెక్టర్ వెంట జెడ్పీ సీఈవో ఎల్లయ్య ,వ్యవసాయ శాఖ నరసింహారావు, పంచాయతీ రాజ్ జగదీశ్వర్ రావు,డీ ఈ లు సత్యానారాయణ, రామారావు, ఎంపీడీవోలు, ఆయా గ్రామ సర్పంచులు, పంచాయతీ సెక్రటరీలు, తదితరులు పాల్గొన్నారు.

# విమోచన దినోత్సవం పురస్కరించుకొని మూడు రంగుల జాతీయ జెండా ఎగరవేసిన ఎర్రం మహేష్

వేములవాడ, సెప్టెంబర్ 17 (నేటినిజం ప్రతినిధి): తెలంగాణ విమోచన దినోత్సవ వేడుకలను పురస్కరించుకుని వేములవాడ తెలంగాణ తల్లి విగ్రహం ముందు బిజెపి సీనియర్ నాయకుడు ఎర్ర మహేష్ జాతీయ జెండా ఎగురవేశారు . సందర్భంగా ఎర్రం మహేష్ మాట్లాడుతూ నాడు తెలంగాణ సాయుధ పోరాటంలో అసువులు బాసిన ఎందరో మహనీయుల త్యాగ ఫలితంగానే నిజాం నిరంకుశ , రజాకార్ల కర్కశ పాలన నుండి సర్దార్ వల్లభాయ్ పటేల్ సైనిక చర్య , రైతాంగ సాయుధ పోరాటం , గెరిల్లా ఉద్యమం మొదలగు పోరాటాల ఫలితంగానే తెలంగాణ ప్రాంత విముక్తి కలిగిందని అన్నారు . అంతే కాకుండా ఉద్యమాల పురిటి గడ్డ అయినటువంటి ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో పురుడు పోసుకొని పోరాడిన ఆనాటి పోరాట యోధులను మనం ఎల్లప్పుడూ స్మరించుకోవాలని తెలిపారు . అనంతరం భారత ప్రధాని నరేంద్ర మోడీ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించి ప్రధానమంత్రికి శుభాకాంక్షలు తెలిపారు తెలిపారు ఈ కార్యక్రమంలో సుమంత్ రెడ్డి ,బాలకృష్ణ , వేముల శ్రీనివాస్ ,డి .రాజ్ రెడ్డి, శంకర్ రెడ్డి , అనిల్ సిహెచ్ నాగరాజు , ఎర్ర సాయి , మహేష్ , తిరుపతి



Printed, Published and owned by VEENADAS,at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telangana. Published at SRT-74,Jawahar nagar, Ashok nagar, Hyderabad-500020. Telangana. 'Editor: B. Devadas, Ph.No.040- 2766 2477.
**RNI No.52865/93.** E-mail :netinijam93@gmail.com.